POSTAL REG NO GDP-38/2017-2019

بِسْمِ اللّٰہِ الرَّحْمٰنِ الرَّحِیْمِ نَحْمَدُہٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِہِ الْکَرِیْمِ وَعَلٰی عَبْدِہِ الْمَسِیْحِ الْمَوْعُوْدِ

وَلَقَدْ نَصَرَكُمُ اللّٰهُ بِبَدْرٍ وَّاَنْتُمْ اَذِلَّةٌ (ఆలె ఇమ్రాన్:124)

సంపుటి 2

సంచిక 3

వార్షిక చందా 300/-రూ॥

# బదర్

వార పత్రిక

The Weekly BADAR Qadian TELUGU

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

www.akhbarbadrqadian.in

19 జనవరి2017, 20 రబి ఉస్సాని 1438 హి.ఖ, 19 సులహ్ 1396, హి.శ,

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగానే యున్నారు. అల్ హందులిల్లాహ్.

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ ఆయురారోగ్యము, ఉన్నత ఆశయాల సాధన, ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు కొనసాగించ గలరు. అల్లాహ్ తాలా అనుక్షణం హుజూర్ ను రక్షించుచు సహాయ, సహకారము అందించుగాక! *(ఆమీన్)*

భూమ్యాకాశములు సృష్టించబడినప్పటి నుండి మన మహ్దీ కొరకు రెండు సంకేతములు నిర్ణయించ బడినవి. ఏ అవతారుని కొరకు ఈ సంకేతములు ప్రత్యక్షము కాలేదు. వాటిలో ఒకటి వాగ్దాత మహ్దీ కాలంలో చంద్రునికి దాని నిర్ణీత రాత్రులలో మెదటి రాత్రి , సూర్యునికి దాని నిర్ణీత దినములలో మధ్య దినమున గ్రహణము సంభవించును. **ప్రవచనములు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం**

రెండవ చిహ్నము: సహీ దారుల్ ఖుతినిలో ఉన్న హదీసులో ఇమాం ముహమ్మద్ బాఖిర్ గారు ఈ విధముగా తెల్పిరి: “ **ఇన్న లి మహ్దీన ఆయతయిని లం తకూన ముంజు ఖలక అస్సమావాతి వల్ అర్జ యన్ కసిఫూల్ ఖమర లి అవ్వలి లైలతిన్ మిన్ రమజాన వ తన్‌కసిపు శంష ఫిన్నిస్ఫి.”**

అనగా భూమ్యాకాశములు సృష్టించబడినప్పటి నుండి మన మహ్దీ కొరకు రెండు సంకేతములు నిర్ణయించ బడినవి. ఏ అవతారుని కొరకు ఈ సంకేతములు ప్రత్యక్షము కాలేదు. వాటిలో ఒకటి ఏమనగా వాగ్దాత మహ్దీ కాలంలో చంద్రునికి దాని నిర్ణీత రాత్రులలో మెదటి రాత్రి గ్రహణము సంభవించును. సూర్యునికి దాని నిర్ణీత దినములలో మధ్య దినమున గ్రహణము సంభవించును. ఈ సంకేతములు భూమ్యాకాశములు సృష్టించబడినప్పటి నుండి ఏ అవతారుని కొరకు ప్రత్యక్షము కాలేదు. ఈ సంకేతము మహ్దీ కాలములో ప్రత్యక్షమగుట నిర్ణయించబడి యున్నది. నా కాలంలోనే రమజాన్ మాసంలో సూర్య చంద్ర గ్రహణములు సంభవించి దాదాపు 12 సంవత్సరాలు గడిచినవి. హదీసులో ప్రస్తావించినట్లు ఈ గ్రహణము రెండు సార్లు రంజాన్ మాసములో సంభవించినది. మొదటిది ఈ దేశములో , రెండవ సారి అమెరికాలో. ఈ గ్రహణముల సందర్భమున మహ్దీ మవూద్ అని ప్రకటించిన వారు భూమండలంపై నేను తప్ప మరెవరు లేకుండెను. ఈ గ్రహణమును తన సంకేతముగా పేర్కొనుచు ఉర్దూ, ఫారసిక, అరబ్బిలో వందలాది కర పత్రములు, పత్రికలు ప్రపంచ వ్యాప్తముగా మరెవ్వరు ప్రచురించలేదు. అందుకే ఈ ఆకాశ సంకేతము నా కొరకు ప్రత్యేకించబడెను. ఇందుకు రెండవ నిదర్శనము ఏమనగా ఈ సంకేతము ప్రతక్షము కాక 12 సం॥ల ముందు అల్లాహ్ తాలా ఈ సంకేతము గురించి వార్త నందించెను ఈ వార్త బరాహీనే అహ్మదియ్యలో ప్రచురితమై సంకేతము వెలవడక ముందే లక్షలాది ప్రజలకు తెలిసిపోయినది.

ఆశ్చర్యకరమైన విషయమేమనగా జమాత్ వ్యతిరేకులు కేవలం విద్వేషంతో వ్యతిరేకిస్తున్నారు. ప్రథమముగా హదీసులోని పదము చంద్ర గ్రహణము మొదటి రాత్రి,సూర్య గ్రహణము మధ్య దినమున గ్రహనము సంభవించునని హదీసు భావమని ఆరోపించెదరు. కాని వారి ఆలోచనలు అర్థరహితమైనవి. ఎందుకనగా ప్రపంచము సృష్టించబడినప్పటి నుండి అల్లాహ్ తాలా చంద్ర గ్రహణము కోసం మూడు రాత్రులను నిర్ణయించెను. అనగా 13వ, 14వ, 15వ రాత్రులు. కావున ఈ విధముగా చూసినచో చంద్రునికి గ్రహణము మొదటి రాత్రి అనగా చంద్ర మాసం ప్రకారం 13వ రాత్రిలో సంభవించును. అదే విధముగా అల్లాహ్ తాలా సూర్య గ్రహణము కోసం కూడ మూడు దినములను నిర్ణయించాడు. అనగా 27వ, 28వ, 29వ దినములు. ఈ విధముగా సూర్యునికి గ్రహణము సభవించు మధ్య దినము చంద్ర మాసం ప్రకారం 28వ దినము. కావున ఈ తేదిలను అనుసరించే హదీసులలో పేర్కొనట్లుగా రమజాన్ మాసంలో చంద్రునికి 13వ రాత్రి గ్రహణము సంభవించగా, సూర్యునికి 28వ దినము గ్రహణము సంభవించినది.

అరబ్‌ల ప్రకారం చంద్ర మాసపు మొదటి చంద్రున్ని చంద్రుడు అని పిలువరు. మూడు దినముల వరకు దానిని నెలవంకగానే పిలుచుకొంటారు. మరి కొందరు 7 రోజుల వరకు దానిని నెలవంకగానే పిలుచుకొంటారు. రెండవ ఆరోపణను ఒకవేళ మనము స్వీకరించినచో అది ఏమనగా చంద్రుని మొదటి రాత్రి 13వ రాత్రి అయినచో, సూర్యుని మధ్య దినము 28వ దినము అయినచో ఇందులో ఎలాంటి అద్భుతము ఉన్నది?. రమజాన్ మాసంలో చంద్రునికి, సూర్యునికి ఏనాడు గ్రహణము సంభవించలేదా?. దానికి సమాధానం ఏమిటనగా, రమజాన్ మాసంలో ఏనాడు ఈ విధముగా రెండు గ్రహణాలు సంభవించలేదని ఈ హదీసు ఉద్దేశము కాదు. వాస్తవమేమనగా ఒక అవతార పురుషుని కాలములో, ఒక సందేశహరుని కాలంలో ఈ విధముగా ఎన్నడు రెండు గ్రహణములు ఒకే రమజాన్ మాసంలో సంభవించలేదు. ఒకవేళ ఏ సందేశహరుని కాలంలోనైన, ఏ ప్రవక్త కాలంలోనైన ఈ విధముగా ఒకే రమజాన్ మాసంలో రెండింటికి గ్రహణములు సంభవించినచో దీనిని ప్రకటించు వారు తప్ప కుండా ఆధారములను చూపించవలెను. 13వందల సంవత్సరాలలో ఎందరో అసత్యవంతులు తమకు తాము మహ్దీలమని అసత్య ప్రకటనలు చేసిన విషయం ఎవరికి తెలియనిదా!. అంతేగాక వారు యుద్ధాలు కూడ చేసిరి. కాని వారి సమయంలో సూర్యునికి, చంద్రునికి గ్రహణములు ఒకే రమజాన్ మాసంలో సంభవించినాయని ఎవరు నిరూపించగలరు?.ఎప్పటి వరకైతే దీనిని నిరూపించలేరో అప్పటి వరకు ఇదే ఒక అద్భుత నిదర్శనము. ఎందుకనగా దీనినే అంటారు. దానికి సాటి ప్రపంచములో మరెక్కడ లభించదని. కేవలం హదీసులే కాదు పవిత్ర ఖుర్‌ఆన్ కూడ ఈ అద్భుతము వైపు సూచిస్తూ ఇట్లు తెల్పినది. “వ ఖసఫల్ ఖమరు వజుమి అశంషు వల్ కమరు”.

(హఖీ ఖతుల్ వహి, రూహాని ఖజాయిన్ 22, పుట 202-204)

☆☆☆☆☆

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

కొందరు వ్యక్తులు, కొందరు పదవి దారులకు వ్యతిరేకముగా, పదవి దారులు కాని వారికి వ్యతిరేకముగా వారు అలా చేస్తున్నారు, ఇలా చేస్తున్నారు, ఫలాన వ్యక్తి ఫలాన నేరము చేసినాడు, ఫలానా వ్యక్తి ఇస్లాం శాసనమునకు భిన్నముగా నడుచుకుంటున్నాడు, కావున తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలి. ఎందుకనగా వారు జమాఅత్‌ను అపనిందకు గురి చేయుచున్నారని ఫిర్యాదులు చేస్తుంటారు.

పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తాలా ఈ విధముగా నుడివెను. ఏదేని విషయమును గూర్చి మీకు సమాచారం అందినచో ముందుగా ఆ విషయమును పరిశీలించుము. సమాచారం అందించిన వారి మాటలనే ఆధారము చేసుకొని చర్యలు ప్రారంభించ రాదను విషయం ప్రతి వివేకికి తెలుసు. సమాచారం అందించిన వ్యక్తి వ్యక్తిత్వం ఎలాంటిదని ముందుగా వారి నుండే పరిశీలన ప్రారంభమగును.

ఫాసిక్ అనే పదమునకు అర్థం కేవలం చెడ్డవాడనే కాదు. అరబి భాషలో చెడ్డవాడిని కూడ ఫాసిక్ అనే అంటారు. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. కాని నిఘంటువు ప్రకారం స్వభావంలో తొందరపాటు ఉన్నవారిని, ప్రతి చిన్న విషయముపై జగడమాడు తత్వం గలవారిని కూడ ఫాసిఖ్ అనే అంటారు. ఫుస్ఖ్ అనగా అల్ప విధేయత కల్గి యుండడం, విధేయతను వీడి యుండడం.

ఫిర్యాదు చేయువారి స్థితి ఎలా ఉన్నదో గమనించుము. ముందుగా అతడు తన పేరును గోప్యముగా ఉంచుకొనును. ఆ తరువాత అందుకు కావలసిన ఆధారములను ప్రవేశపెట్టడు. ధర్మ శాసన నిబంధనల నుండి నేను స్వతంత్రుడిని కాను, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్వతంత్రులు కారు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారే స్వయముగా ధర్మశాసనమును అనుసరించేవారు.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు ఒకసారి ఇటువంటి సమస్య వచ్చినప్పుడు ఇద్దరు జగడమాడు వారు వచ్చిరి. అప్పుడు వారు (స) ఇట్లనిరి. అల్లాహ్ తాలా ఆదేశము మేరకు నేను తీర్మాణము చేయుదును, కాని ఎవరైన అసత్య ప్రమాణములు చేసినచో వారి వ్యవహారము అల్లాహ్ చేతిలో ఉండును. అతడు వారిని శిక్షించును.

అల్లాహ్ తాలా ఆదేశానుసారమే మనము మన సమస్యలలో తీర్మాణం చేయించుకొను వారుగా మారవలెను. తమ పేరు ప్రతిష్టను, ప్రాధాన్యతలను పునాదిగా చేసుకొని తమకు అనుకూలంగా తీర్పు చేయించుకొనుటకు జమాఅత్ వ్యవస్థపై మరియు వర్తమాన ఖలీఫా గారిపై ఎలాంటి ఒత్తిడిని తీసుకరాకూడదు. అల్లాహ్ తాలా ఫిర్యాదులు చేయువారికి వివేకమును ప్రసాదించు గాకా!. వాస్తవానికి జమాఅత్ వ్యవస్థకు నష్టము వాటిల్లుచున్నదని భావించినచో ధైర్యముతో ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి. ఆ తరువాత ఎదురుయ్యే ప్రతి సమస్యను ఎదురించాలి. అన్ని విధాలా న్యాయబద్ధముగా అల్లాహ్ తాలా ఆదేశములను పాటించుచూ సున్నత్ ప్రకారము నిర్ణయము తీసుకొనుటకు మరియు వర్తమాన ఖలీఫా ద్వారా తీర్మాణము చేయుటకు నియమించబడిన వారందరిని అనుగ్రహించు గాకా!. (ఆమీన్)

జుమా నమాజ్ తదుపరి నేను కొన్ని పరోక్ష జనాజ నమాజ్‌లను చదువించెదను. ప్రథమ జనాజ నమాజ్ గౌ॥ సాజిద్ ముహమ్మద్ తండ్రి గౌ॥ షేక్ మజీద్ అహ్మద్ గారిది. వీరు కరాచి జిల్లా, గుల్జార్ హిజ్రి ప్రాంత నివాసులు. అహ్మదీయ్య వ్యతిరేకులు వీరిని నవంబర్ 27, 2016న మఘ్‌రిబ్ నమాజ్ తరువాత ఇంటి ముందు బైక్‌పై కూర్చొని ఉండగా కాల్చి చంపిరి. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.

రెండవ జనాజా నమాజ్ గౌ॥ షేక్ అబ్దుల్ ఖాదర్ తండ్రి షేక్ అబ్దుల్ కరీం దర్వేష్ ఖాదియాన్ గారిది. వీరు నవంబర్ 26, 2016న హృదయ స్పందన ఆగిపోవడం వలన 92 సంవత్సారాల వయస్సులో పరమపదించిరి. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.

మూడవ జనాజ తన్వార్ అహ్మద్ లోన్, నాసిరా బాద్, కాశ్మీర్ గారిది. వీరు దేశ సరిహద్దు సైన్యంలో పని చేయుచున్నారు. నవంబర్ 25, 2016న కార్యనిర్వాహణలో ఉండగానే, సదర్ జిల్లా, కోల్గామ్ ప్రాంతములో శత్రు దేశస్థుల కాల్పుల వలన వీరు వీర మరణం పొందిరి. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.

**సయ్యిద్నా అమీరుల్ మొమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 02 డిసెంబర్ 2016 ( 02 ఫతహ్ 1395 హి.షు) తేదీన మస్జిద్ ఫజల్, లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُولُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ- بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ۔

కొందరు వ్యక్తులు, కొందరు పదవి దారులకు వ్యతిరేకముగా, పదవి దారులు కాని వారికి వ్యతిరేకముగా వారు అలా చేస్తున్నారు, ఇలా చేస్తున్నారు, ఫలాన వ్యక్తి ఫలాన నేరము చేసినాడు, ఫలానా వ్యక్తి ఇస్లాం శాసనమునకు భిన్నముగా నడుచుకుంటున్నాడు, కావున తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలి. ఎందుకనగా వారు జమాఅత్‌ను అపనిందకు గురి చేయుచున్నారని ఫిర్యాదులు చేస్తుంటారు. కాని ఫిర్యాదు చేయువారిలో అధికులు తమ నామమును మాత్రం వ్రాయరు, లేదా బూటకపు పేరు వ్రాసి తప్పడు చిరునామాలు వ్రాస్తుంటారు. ఇటువంటి వ్యక్తుల ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోబడవు, చేపట్టరాదు కూడ. కొంత కాలం గడిచిన పిదప మరల ఫిర్యాదు చేస్తూ నేను ఫలానా వ్యక్తిని గూర్చి గతంలో వ్రాసాను, కాని నేటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.ఒకవేళ చర్యలు తీసుకొననిచో చాలా పెద్దఘోరం జరిగిపోవునని మరల వ్రాస్తుంటారు. పేర్లు వెల్లడించకుండా ఫిర్యాదులు చేసే అలవాటు పాకిస్తాన్, భారతదేశ ప్రజలలోనే అధికముగా గలదు. ఇతర దేశాల నుండి నామ మాత్రముగా వ్రాస్తుంటారు. కాని పాకిస్తాన్ దేశములో ఉన్న వారికి, ఇతరదేశాలలో ఉన్న పాకిస్తానీయులకే ఈ అలవాటు అధికముగా ఉన్నది. ఇదేమి క్రొత్త విషయం కాదు. అన్ని కాలాలలో ఇలాంటి ఫిర్యాదులు చేసే వ్యక్తులు ఉంటారు, అలాంటి వారిలోని కొందరు నేడు నాకు కూడ వ్రాస్తుంటారు. రెండవ ఖలీఫా గారి కాలంలో, మూడవ ఖలీఫా గారి కాలంలో, నాలుగవ ఖలీఫా గారి కాలంలో పేర్లు వెల్లడించకుండా ఇలాంటి ఫిర్యాదులు చేసేవారు ఉండేవారు.

ఇలాంటి ఫిర్యాదులు చేయువారిని ఉద్దేశించి రెండవ ఖలీఫాగారు ఒక సందర్భములో ఒక జుమా ప్రసంగమునే ఇచ్చిరి. ఆ ప్రసంగం ఎంతో విపులముగా, హితోపదేశముగా ఉన్నది, కావున ఇలాంటి వారి నోరు మూయించడం కోసం నేను ఆ ప్రసంగము నుండి కొంత భాగాన్ని మీముందు తెలుపెదను.

తమ పేర్లను వెల్లడించకుండా ఇలా ఫిర్యాదులు చేయువారు

దాంబికులై ఉందురు లేదా అసత్యవంతులై ఉందురు. ఒకవేళ వారిలో ధైర్యము, నిజాయితియే ఉన్నచో వారు దేనిని లెక్క చేయక పోయేవారు. వారు జమాఅత్ కోసం తమ ప్రాణమును, ధనమును, సమయమును, గౌరవమును త్యాగము చేయుటకు అనుక్షణం సిద్ధముగా ఉంటామని వాగ్దానము చేస్తారు. కాని ఎప్పుడైతే జమాఅత్ పేరు ప్రతిష్టల విషయము ముందుకు వచ్చునో అప్పుడు వారు తమ పేరు ప్రతిష్టలకు తలవంపులు రాకుండా ఉండుటకు తమ పేర్లను దాస్తుంటారు. కావున ప్రారంభములోనే పిరికితనం చూపిన వ్యక్తుల ఇతర విషయాలు కూడ తప్పేనని స్పష్టమగును.

పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తాలా ఈ విధముగా నుడివెను. ఏదేని విషయమును గూర్చి మీకు సమాచారం అందినచో ముందుగా ఆ విషయమును పరిశీలించుము. సమాచారం అందించిన వారి మాటలనే ఆధారము చేసుకొని చర్యలు ప్రారంభించ రాదను విషయం ప్రతి వివేకికి తెలుసు. సమాచారం అందించిన వ్యక్తి వ్యక్తిత్వం ఎలాంటిదని ముందుగా వారి నుండే పరిశీలన ప్రారంభమగును. అతడు అన్ని రకాల చెడులనుండి దూరం ఉన్నాడా? లేడా? ఏదేని చెడు లక్షణానికి బానిసయై యున్నాడా? లేడా? అతని విశ్వాసం బలహీనంగా ఉన్నదా? పటిష్టముగా ఉన్నదా? ఒకవేళ అతడు బలహీన విశ్వాసాన్ని కల్గి యుండి ఇతరులపై ఆరోపణలు చేయుచున్నాడా? అని ముందుగా అతని గూర్చి తెలుసుకోవడం జరుగుతుంది.

సాధారణముగా పదవి దారులపైన లేక ఇతరులపైన భయంకరమైన ఆరోపణలు చేయువారు ఇతరుల ద్వారా తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని భావించినప్పుడే ఇంత భయంకరమైన ఆరోపణలు చేస్తుంటారు. అందుకే పరిశీలన ప్రారంభించుటకు ముందే ఆరోపణలు చేయువారు విశ్వాసియా? లేక దాంబికుడా? అని ఆలోచించడం జరుగుతుంది. కావున ఫిర్యాదు చేయువారి గూర్చి ఏ విషయము తెలియనప్పుడు వారిని ఏ కోవకు చెందిన వారిగా గుర్తించాలో అర్థం కాదు. హాఁ ఒకవేళ జమాఅత్‌కు భారీ స్థాయిలో నష్టము వాటిల్లుతుందని ఫిర్యాదు చేయువారు వ్రాసినప్పుడు స్వయముగా పరిశీలన ప్రారంభించెదము. అదే విధముగా ఫిర్యాదు చేయువారిని గూర్చి తెలిసినప్పుడు కూడ వారు ఏ కోవకు చెందిన వారని ముందుగా పరిశీలించడం జరుగుతుంది. ఆ తరువాత అతడు తెలిపిన విషయము ఎంత వరకు సత్యమైనది?, ఎంతవరకు అసత్యమైనదని ఆలోచించెదము. ఈ విషయంను గూర్చి గల పవిత్ర ఖుర్ఆన్ బోధలను వివరిస్తూ హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) ఈ విధముగా తెల్పిరి: పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ విధముగా గలదు. ان جآء کم فاسق بنبا فتبینوا. అనగా మీ వద్దకు ఒక అవిధేయుడు ఫిర్యాదు తీసుకొని వచ్చి ఇతరులను గూర్చి చెడుగా మాట్లాడినచో ముందుగా ఆ విషయమును పరిశీలించుము. ఆ తరువాత చర్యలు తీసుకొనుము. కాని ఫిర్యాదులు చేయువారు తమ పేరు వ్రాయకుండా స్వయముగా పాపిష్టులవడమే కాకుండా వారు వ్రాసిన విధముగానే వారి మాటను ఆమోదించి వారు ఫిర్యాదు చేసిన వ్యక్తిని వెంటనే శిక్షించాలని పట్టుబడుతారు.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) ఇట్లు తెల్పిరి: ఫాసిక్ అనే పదమునకు అర్థం కేవలం చెడ్డవాడనే కాదు. అరబి భాషలో చెడ్డవాడిని కూడ ఫాసిక్ అనే అంటారు. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. కాని నిఘంటువు ప్రకారం స్వభావంలో తొందరపాటు ఉన్నవారిని, ప్రతి చిన్న విషయముపై జగడమాడు తత్వం గలవారిని కూడ ఫాసిఖ్ అనే అంటారు. ఫుస్ఖ్ అనగా అల్ప విధేయత కల్గి యుండడం, విధేయతను వీడి యుండడం. ఈ విధముగా చూసినచో ఫాసిఖ్ అనగా సహకరించని వ్యక్తి, జగడమాడు వ్యక్తి అని అర్థం. ప్రజల చిన్న చిన్న తప్పిదాలను బూతద్దములో చూపించే వారిని మరియు తాను కోరిన విధముగా వారిని శిక్షించాలని కోరుకొను వ్యక్తిని, ఎలాంటి క్షమాగుణంను ప్రదర్శించని వ్యక్తిని కూడ ఫాసిఖ్ అనే అంటారు.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) ఒక పాత అహ్మదీ మిత్రుని గూర్చి ఇలా తెల్పిరి: ఆ మిత్రుని వినమ్రతలో ఏ మాత్రం అనుమానం లేదు. కాని చిన్న చిన్న విషయాలకే పెద్ద పెద్ద శిక్షలు విధించాలని ఆశించేవాడు. చిన్న చిన్న తప్పిదాలపై కూడ అవిశ్వాస ఆదేశాన్ని జారి చేసేవాడు. ఏదైన తప్పిదము జరిగినచో అవిశ్వాస ముద్ర వేసేవారు. అందుకు ఒక ఉదాహరణను వారి (ర) ఇట్లు తెల్పిరి, ఒకవేళ అత్తయ్యాతూ పఠించే సమయంలో తమ కుడి కాలి వేలును నిలబెట్టనిచో, ఎందుకనగా అత్తయ్యాతూ పఠించే సమయంలో కుడి కాలి వేలును నిలబెట్టవలెను. ఈ విషయం కూడ వారి దృష్టిలో అవిశ్వాస స్థాయికి చేరినదై యుండును. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) మరల ఇట్లు తెల్పిరి: నాకు మడమలో బాధ ఉన్నందున నేను కూడ అత్తయ్యాతూ పఠించే సమయంలో కుడి కాలి వేలును నిలబెట్టేవాడిని కాదు. గతంలో నిలబెట్టేవాడిని. ఒక వేళ ఆ హాఫిజ్ గారు జీవించి యుండి నన్ను కూడ చూసినచో నాపై కూడ వారు సాయంత్రము వరకు అవిశ్వాస ముద్రను వేసేవారు. ఇలాంటి వారు కూడ ఉంటారు. వారు ఎందుకు అలా ప్రవర్తిస్తారనగా అలా కాలిని నిలబెట్టడం హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సాంప్రదాయము. అలా నిలబెట్టనిచో ఆ సాంప్రదాయమునకు విరుద్ధమగును. ఆ విధముగా చూసినచో వారికి ప్రవక్త గారి సాంప్రదాయముపై విశ్వాసం లేదని భావించెదరు. ఒకవేళ ప్రవక్త గారి సాంప్రదాయముపైనే విశ్వాసం లేనిచో , పవిత్ర ఖురాన్‌పై విశ్వాసం లేనట్లుగును, పవిత్ర ఖుర్ఆన్‌పై విశ్వాసం లేనిచో అల్లాహ్‌పై విశ్వాసం లేనట్లుగును. అల్లాహ్‌పై విశ్వాసం లేనప్పుడు అది అవిశ్వాసంగా లెక్కించబడునని అలాంటి వారు వాదించుదురు. మొత్తానికి హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) ఎంత వినమ్రతను ప్రదర్శించే వారైనను వారి స్వభావంలో తొందరపాటు ఉన్నచో వారిని ఈ ఉదాహరణ క్రిందికే తీసుకవచ్చిరి. అలాంటప్పుడు పేర్లు వ్రాయకుండా, స్వయముగా విశ్వాసంలో కూడ బలహీన స్థాయిని కల్గి యుండి, ఇతరులపై ఆరోపణలు చేయుచున్నచో వారందరు ఈ అర్థములన్నింటి దృష్ట్యా వారు ఫాసిఖ్ అని అనబడుదురు.

పేర్లు వ్రాయకుండా, తమను పరిచయం చేసుకోకుండా ఫిర్యాదులు చేయువారందరు ఇలాంటి చర్యలు పవిత్ర ఖుర్ఆన్ ఆదేశాలకు విరుద్ధమైనవని గుర్తుంచుకోవాలి. ఎందుకనగా ఫిర్యాదు చేసిన వ్యక్తిని గూర్చి ముందుగా పరిశీలన జరుపుము అని పవిత్ర ఖురాన్ ఆదేశిస్తున్నది. ఒకవేళ ఎలాంటి పరిశీలన చేయకుండానే ఫిర్యాదు చేయువారి ఆరోపణల ప్రకారం చర్యలు తీసుకోవడం ప్రారంభించనచో జమాఅత్ అభివృద్ధి వైపు ముందడుగు వేయుటకు బదులు క్షీణతవైపు పయణించును. చివరికి క్షీణించిపోవును. వర్తమాన ఖలీఫా , లేదా జమాఅత్ వ్యవస్థ ఎలాంటి పరిశీలన చేయకుండా ఇతరుల ఆకాంక్ష మేరకు చర్యలు తీసుకోవడం ప్రారంభించినచో జమాఅత్ అభివృద్ధి వైపు అడుగులు వేయలేదు. ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి నా అభీష్టము మేరకు ఫలాన వ్యక్తిని శిక్షించండి అని కోరుకోవడం జరుగుతుంది.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) మరల ఇట్లు తెల్పిరి: ఒకవేళ ఫిర్యాదు చేయు వ్యక్తి వినమ్రత గలవాడు, జాగరూకుడు, నిజాయితి పరుడని తెలిసిన కూడ వారు చేసిన ఫిర్యాదు వాస్తవికతను తెలుసుకొనుటకు పరిశీలన చేయడం జరుగుతుంది. ఒకవేళ ఫిర్యాదు చేయు వ్యక్తి నిజాయితి పరుడు, విధేయత గలవాడు, సత్యవంతుడు అని మాకు పూర్తి నమ్మకం కల్గినా కూడా మేము ఆ ఆరోపణలను గూర్చి తప్పకుండా పరిశీలన చేయించవలసి ఉంటుంది. ఆ వ్యక్తిని కూడ పరిశీలించబడును. ఎందుకనగా ఏ విషయములో ఎంత వాస్తవము ఉన్నదో కూడ తెలియాలి కదా!.

మరల వారు (ర) ఇట్లు తెల్పిరి: ఒకసారి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నమాజ్ చేయించుచుండిరి. నమాజ్‌లో ఏదో పొరపాటు జరిగినది. వెనుక యున్న వారిలో హజ్రత్ అలి (ర) గారు కూడ ఉండిరి. వారు (ర) ఆ పొరపాటు సవరించినారు. ఈ చర్యను హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇష్టపడలేదు. సవరించమని నీకు ఎవరు చెప్పినారని వారిని మందలించిరి. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) ఈ విషయమును వివరిస్తూ ఈ విధముగా తెల్పిరి, వారు (స) హజ్రత్ అలి (ర) ను మందలించడంలో గల ఉద్దేశం బహుశా నీవు చేయవలసిన పెద్ద పెద్ద పనులు ఎన్నో ఉన్నాయి, నీవు వాటివైపు శ్రద్ధను కేంద్రికరించుము. ఇలాంటి చిన్న చిన్న పనులను ఇతరులు చక్కబెట్టుకోనిమ్ము. లేదా ఈ పని హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద పవిత్ర ఖుర్ఆన్ నేర్చుకునే ఖారీలు చేయవలసినది. కావున వారినే చేయనివ్వుము అని కూడ అర్థం వచ్చును. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) పేర్లు వ్రాయకుండా ఫిర్యాదు చేయు వ్యక్తులను గూర్చి తెల్పుచు ఇట్లనిరి: ఫిర్యాదు చేయు వ్యక్తి ఒకవేళ గొప్పవాడే అయినచో, అలాంటి వారికి నేను తెల్పునది ఏమనగా మీరు మీ బాధ్యతల వైపు శ్రద్ధ చూపుము. ఇలాంటి చిన్న చిన్న విషయాలను గూర్చి మీరు పట్టించుకోకుము. కావున ఫిర్యాదు చేయువారు తమ పేరును వెల్లడించనందున వారి స్థానము, వారి స్వభావము తెలియనందున వారికి నచ్చజెప్పలేము.

రెండవ విషయం ఏమిటనగా, అతడు పదవి దారులపై, శాఖల అధికారులపై, మహిళలపై ఎంతో పెద్ద పెద్ద ఆరోపణలను చేసెను. ఈ చర్య చాలా తప్పుడు చర్య. అంతేగాకా ఫలాన ఫలాన వ్యక్తిలో ఈ విధములైన లోపములు గలవని అతడు బహిర్గతము చేసెను. ఒకవైపు

అతడు వారు పవిత్ర ఖుర్ఆన్ మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశాలను వ్యతిరేకముగా నడుచుకొను చున్నారని వారిపై ఫిర్యాదు చేస్తున్నాడు. పవిత్ర ఖుర్ఆన్ మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశాలకు వ్యతిరేకముగా నడుచుకోవడం చాలా పెద్ద పొరపాటగును. కావున ఇది చాలా పెద్ద పొరపాటుగా లెక్కించబడును. ఒకవేళ ఏ ముస్లిం వ్యక్తి అయిన పవిత్ర ఖుర్ఆన్ మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశాలను వ్యతిరేకముగా నడుచుకోనప్పుడు దానిని తప్పిదముగా ఎవరు భావించలేరు. కాని వారి బోధనలకు వ్యతిరేకముగా ఏ చిన్న పని చేసినను అది తప్పిదముగానే భావించబడును. మొత్తానికి ఫిర్యాదు చేయువారు ఒకవైపు ఫలానా ఫలానా వ్యక్తులు పవిత్ర ఖుర్ఆన్ మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఆదేశాలకు భిన్నముగా నడుచుకొనుచున్నారని ఫిర్యాదు చేస్తూనే, అతడు చేయు ఫిర్యాదుకు గల నిబంధనలను విరుద్ధముగా ఫిర్యాదు చేస్తూ అతడు కూడ తప్పిదమునకు పాల్పడుచున్నాడు. అనేకులు ఈ విధముగానే చేస్తుంటారు. నాకు కూడ ఫిర్యాదు చేయువారు ఆ నిబంధనలను ఉల్లఘించి ఫిర్యాదు చేస్తుంటారు. వాస్తవమేమిటనగా పవిత్ర ఖురాన్ మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సాంప్రదాయమును అనుసరించడమే ప్రధానం. ఏదేని విషయమును గూర్చి చర్చించ దల్చినచో పూర్తి ఆధారాలను ప్రవేశపెట్టుమని, పరిశీలన చేయుమని పవిత్ర ఖుర్ఆన్ బోధించుచున్నది. కాని ఇక్కడ వారు తమ పేర్లనే వ్రాయనప్పుడు ఏ విధముగా పరిశీలన కొనసాగును. ఈ చర్య పవిత్ర ఖుర్ఆన్ ఆదేశాలకు విరుద్ధమైన చర్య అనబడును. కావున ఫిర్యాదు చేయువారే స్వయముగా పవిత్ర ఖుర్ఆన్ ఆదేశాలను ఉల్లఘించినట్లగును. పవిత్ర ఖుర్ఆన్ మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశానుసారము నడుచుకోవడమే అసలైన సత్కార్యమని ఎల్లప్పడు గుర్తుంచుకోవాలి. ఎవరికైనను వారి ఆసక్తి వలన లేదా సమాజంలో గల వారి ఆసక్తి ప్రభావం వలన ఒక విషయం వారికి చెడుగా కనిపించవచ్చును. కాని ఆ విషయం పవిత్ర ఖుర్ఆన్ మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనల ప్రకారం సరైనదే అయినచో దానిని సత్యముగానే స్వీకరించవలెను. అందులో ఎలాంటి పొరపాటు లేదు. కొందరు వారి స్వభావం మరియు ఆచార వ్యవహారాల దృష్ట్యా ప్రభావం చెంది కొన్ని విషయాలలో కఠినంగా వ్యవహరిస్తారు. అలాంటి వారు ధార్మిక ప్రయోజన నిమిత్తమేనని ఎన్ని విషయాలు తెల్పిన కూడ వాటిని పరిగణలోకి తీసుకోనబడవు. ఇందుకు వివరణగా నేను హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) గారి మరొక వ్యాక్యను మీముందు ప్రస్తావించెదను. గతంలో కూడ ఈ వాక్యను నేను మీ ముందు ప్రస్తావించాను. కాని ఆ వాక్య ఈ సందర్భానికి అనుకూలంగా ఉన్నందున మరల ఇచట ప్రస్తావిస్తున్నాను. ఒకరోజు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హజ్రత్ అమ్మ జాన్ గారితో (వారి శ్రీమతితో ) మరోచోటుకి వెళ్ళుటకు రైల్వేస్టేషన్‌కు వెళ్ళిరి. ఆ రోజులలో పరదా ఆచారాన్ని చాలా కఠినంగా ఆచరించేవారు. ధనవంతులుగా, గౌరవనీయ కుంటుంబాలకు చెందిన వారి మహిళలు ఆ రోజులలో స్టేషన్‌కు పల్లకిలలో వచ్చే సాంప్రదాయం కలదు. పల్లకికి కుడి, ఎడమ రెండు వైపుల పరదాలు ఉండేవి. రైలు కోచ్‌ల వరకు వారిని ఆ విధముగానే పల్లకిలలో తీసుకవెళ్ళగా వారు కోచ్‌లోకి వెళ్ళేవారు. మరల పరదాను పాటించుతూ వారిని కిటికి వైపు కూర్చోబెట్టి ఇతరులు చూడకుండా ఉండుటకు పరదాలు వేసేవారు. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) మరల ఇట్లు తెల్పిరి: ఈ పరదా విధానం చాలా కఠినముగా ఉండేది. ఈ విధానము ఇస్లామీయ పరదా ఆదేశమునకు పూర్తి భిన్నమైనది, కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇస్లామీయ బోధనల అనుసారమే ప్రతి విషయమును అనుసరించేవారు. హజ్రత్ అమ్మజాన్ గారు బురఖా వేసుకోని కాలినడకకు వెళ్లే వారు. ఆ రోజు కూడ హజ్రత్ అమ్మజాన్ బురఖా వేసుకొని యుండిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు వారి(ర)ని వెంటబెట్టుకొని స్టేషన్ ప్లాట్‌ఫారంపై పచార్లు చేయుచుండిరి. హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీం(ర) గారు మరియు హజ్రత్ మౌల్వీ హకీం నూరొద్దిన్ (ర) గారు ఇరువురు కూడ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు తోడుగా స్టేషన్‌లో కూర్చుండిరి. మౌల్వీ అబ్దుల్ కరీం (ర) గారి స్వభావంలో తొందరపాటు ఎక్కువ ఉండేది. వారి దృష్టిలో పొరపాటు జరుగుచున్నది. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు తెలుపుటకు వారు ధైర్యం చేయలేక పోవుచుండిరి. అందుకే హజ్రత్ హకీం నూరొద్దిన్ (ర) గారి వద్దకు వెళ్లి , మౌల్వీ సాబ్ ఇక్కడ ఏమి జరుగుతుంది. రేపటి పేపర్లలో మిర్జా గారు తమ శ్రీమతితో ప్లాట్ ఫాం పై పచార్లు చేయుచున్నారని సంచలనాత్మక కథనాలు ప్రచురితమగును. కావున మీరు వెళ్లి మసీహ్ మౌవూద్ (అ) గారికి నచ్చజెప్పగలరని వేడుకొనిరి. అందుకు మౌల్వీ నూరొద్దిన్ (ర) గారు నా దృష్టిలో ఇది పొరపాటు కాదు, ఒకవేళ నీకు ఏమైన అభ్యంతరం ఉన్నచో నీవే స్వయముగా వెళ్లి తెలుపుమని సలహా ఇచ్చిరి. మసీహ్ మౌవూద్ (అ) పచార్లు చేస్తూ దూరం వెళ్లిరి. మొత్తానికి మౌల్వీ అబ్దుల్ కరీం (ర) మసీహ్ మౌవూద్ (అ) వద్దకు చేరుకొనిరి. కాని తిరిగి వస్తున్నప్పడు వారు (ర) తల దించుకొని వస్తుండిరి. సమాధానం ఏమి దొరికిందో తెలుసుకోవాలనే కుతుహలం నాలో కల్గినదని మౌల్వీ నూరొద్దిన్ (ర) గారు తెల్పిరి. అందుకే మౌల్వీ గారు సమీపంనకు చేరుకోగానే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఏమని సమాధానం ఇచ్చినారని ప్రశ్నించితిని. అందుకు మౌల్వీ గారు, నేను హుజూర్ గారితో మీరు ఏం చేస్తున్నారు? ప్రజలు ఏ విధముగా మాట్లాడు కొందురు? అని విన్నవించుకోగానే, హుజూర్ గారు మా గూర్చి ప్రజలు ఏమను కొందురు. మిర్జా గారు తమ శ్రీమతితో పచార్లు చేస్తున్నారనే అనుకొందురు కదా!. అంతకు మించి మరేమి అనుకొందురని సమాధానం ఇచ్చిరి. అందుకు మౌల్వీ గారు సిగ్గుతో తల దించుకొని వెనుతిరిగి వచ్చిరి. హజ్రత్ అమ్మజాన్ పరదా పాటించిరి, ఆ తరువాతనే భార్య, భర్తలిరువురు పచార్లు చేయుచుండిరి. కావున ఈ విషయంలో ఎలాంటి తప్పిదము లేదు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ తమ శ్రీమతితో పచార్లు చేసేవారు. ఒక సందర్భములో ప్రజల ముందు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హజ్రత్ ఆయిషా (ర) ఇరువురు పరుగుపందెంలో పాల్గొనిరి. మొదట హజ్రత్ ఆయిషా (ర) విజయం సాధించిరి. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు వెనుకబడిపోయిరి. మరోసారి పందెంలో పాల్గొనప్పడు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం విజయం సాధించిరి. హజ్రత్ ఆయిషా (ర) ఓడిపోయిరి. అప్పడు హుజూర్ (స) హజ్రత్ ఆయిషా (ర) తో, ఆయిషా తిలక్ బ తిలక్ అని తెల్పిరి, అనగా ఓటమికి బదులుగా ఓటమి. మొత్తానికి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ శ్రీమతులతో బయటకు వెళ్లడంను తప్పుగా భావించేవారు కాదు. ఇస్లాం అనుమతించిన విషయాలలో తప్పిదాలు ఉండవు. కావున ఒక వ్యక్తి ఒకరిని నిందించుచున్నచో దాని అర్థం అతని దృష్టిలో ఆ వ్యక్తి ఇస్లాం బోధనలకు అనుగుణంగా ఆచరించడం లేదు.

కాని హజ్రత్ ముస్లే మౌవూద్ (ర) ఫిర్యాదు చేయువారిని గూర్చి మరల ఇట్లు తెల్పిరి, వారు తమ ఉత్తరములలో ఫలానా వ్యక్తి అధమ స్థాయికి చెందిన వాడు, ఫలానా వ్యక్తి నీచుడు, అయిన కూడ మీరు అతనికి ఫలానా పదవిని అప్పగించారు అని వారి వ్యక్తి గత, కుటుంబ అంశాలపై దాడులు చేస్తారు. మరి కొన్ని నిందలు ఎలా ఉండుననగా వాటికి ఆధారముగా స్పష్టమైన సాక్ష్యాలను చూపాలని పవిత్ర ఖుర్ఆన్ ఆదేశిస్తున్నది. సాక్ష్యాలు కూడ 4 గురి సాక్ష్యాలు ప్రవేపెట్టాలి. అప్పడే చేయు ఆరోపణ నిజమైనదని, లేనిచో అది కేవలం ఆరోపణయేనని అందులో వాస్తవం లేదని భావించబడును. కొందరు అక్రమ సంబంధాలను గూర్చి ఫిర్యాదు చేస్తారు. ఇస్లాం ఆదేశానుసారం ఇలాంటి వ్యవహారాన్ని పరిశీలించుటకు 4గురు వ్యక్తుల సాక్ష్యములు ప్రవేశపెట్టాలి. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే పవిత్ర ఖురాన్ బోధనలకు విరుద్ధముగా నడుచుకునే వారికే ధార్మిక పౌరుషం పుట్టుకొచ్చినది. పవిత్ర ఖుర్ఆన్ నివారించిన నిందలను వారు ఇతరులపై మోపుచుంటారు. కేవలం నివారించలేదు. ఇలా నిందలు మోపువారు సాక్ష్యాలు చూపనిచో వారినే శిక్షించుమని ఆదేశించిన విషయాలపై వీరు ఫిర్యాదులు చేస్తుంటారు. ఇతరులపై తప్పడు నిందలు వేయువారికి 80 కొరడా దెబ్బలను పవిత్ర ఖుర్ఆన్ నిర్దేశించినది. మొత్తానికి ధర్మశాసనము ఈ విషయములో కఠినమైన ఆదేశమును వెలువడించినను, వీరు ఆదేశములను ఉల్లంఘిచడమే గాకా ఫలానా వ్యక్తి పవిత్ర ఖుర్ఆన్ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నాడని ఫిర్యాదులు చేస్తుంటారు. వాస్తవానికి వారే స్వయముగా పవిత్ర ఖుర్ఆన్ ఆదేశాలను ఉల్లంఘిస్తారు.

మరల వారు (ర) ఇట్లు తెల్పిరి: కావున ఫిర్యాదు చేయువారి స్థితి ఎలా ఉన్నదో గమనించుము. ముందుగా అతడు తన పేరును గోప్యముగా ఉంచుకొనును. ఆ తరువాత అందుకు కావలసిన ఆధారములను ప్రవేశపెట్టడు. ధర్మ శాసన నిబంధనల నుండి నేను స్వతంత్రుడిని కాను, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్వతంత్రులు కారు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారే స్వయముగా ధర్మశాసనమును అనుసరించేవారు. కావున ఒక వ్యక్తి ధర్మశాసనము హెచ్చరించిన అంశాలనే ఆరోపించసాగెను.

అందుకు ధర్మశాసనము నిర్దేశించిన విధముగానే సాక్ష్యాలు ప్రవేశ పెట్టబడును. కాని ఒకరు ఫలానా వ్యక్తి ఫలానా ఖురాన్ ఆదేశామును ఉల్లంఘించెను, కావున అతనిని మీరు శిక్షించండి కాని నన్ను మాత్రం ఏమి అనకూడదని వ్రాస్తుంటారు.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) మరల ఇట్లు తెల్పిరి: బాల్యములో విన్న ఒక కథ నాకు గుర్తుకు వచ్చినది. నా బాల్యములో నేను ఆ విషయం ద్వారా ఎంతో ఆనందాన్ని పొందాను. నేడు కూడ ఒకవేళ ఆ కథ గుర్తుకు వచ్చినచో నాకు నేడు కూడ చాలా నవ్వు వస్తుంది. 5లేదా 6 వ తరగతిలో ఉండేవాడిని. మా ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నకు సమాధానం నిర్దేశిత సమయంలో చెప్పినచో ఆ విద్యార్థి ఒక్కొక్క స్థాయి ముందుకు వెళ్ళుననే ఒక నిబంధనను ఏర్పాటు చేసినాడు. మేమందరం నిలుచున్నాము. ఉపాధ్యాయుడు ప్రశ్నించగా ఒక మాతోటి విద్యార్థులలో ఒకరు సమాధానం ఇచ్చెను. మరో విద్యార్థి మాస్టర్ గారు అతను ఇచ్చిన సమాధానం సరైనది కాదు అని తెలుపెను. అందుకు మాస్టరు గారు ముందు సమాధానం ఇచ్చిన విద్యార్థిని నీవు వెనుకకు వెళ్ళుమని రెండవ విద్యార్థిని ముందుకు రమ్మని ఆదేశించెను. అందుకు ముందు సమాధానం ఇచ్చిన విద్యార్థి వెనుకకు వెళ్ళి మాస్టర్ గారు, అతడు నా తప్పును చూపుతూ, నేను తప్పగా చెప్పిన పదాన్ని తప్పగా ఉచ్చరించాడని తెలుపెను. అందుకు మాస్టర్ గారు మరల ఆ విద్యార్థిని యధావిధిగా ముందు వరసలో కూర్చోబెట్టెను. ఈ కథను వినిపించి వారు (ర) ఇట్లు తెల్పిరి: ఫిర్యాదులు చేయువారిది కూడ ఈ పరిస్థితియే. వారు ఇతరుల లోపాలు, తప్పిదాలను వ్రాస్తుంటారు. కాని వ్రాసే విదానము సరైనది కాదు. ఆ విధముగా వారు ఇతరులను శిక్షింపజేయుటకు ప్రయత్నిస్తూ, ప్రయత్నిస్తూ స్వయముగా శిక్షించబడుదురు. ఆ తరువాత దోషి శిక్షించరు కాని, దోషిని పట్టించిన వారినే శిక్షిస్తున్నారని గగ్గోలు పెడుతుంటారు. వాస్తవానికి ఈ విషయంలో శిక్షించేవారు ఏమిచేయగలరు. వారు కూడ ధర్మశాసనానికి కట్టుబడియే ఉంటారు. ఒకవేళ పవిత్ర ఖుర్ఆన్ శాసన రాజ్యాన్ని స్థాపించదలచినచో ముందుగా మీరు అల్లాహ్ తాలా ఆదేశాలను అనుసరించండి. ఇతరుల పైనే దేవుని అధికారము కొనసాగాలి. మాపై కొనసాగకూడదని ఆలోచించినచో ఈ ఆలోచన సరైనది కాదు. కావున నేను ఫిర్యాదులు చేయువారికి తెలుపునది ఏమనగా " అయ్యాజ్ ఖదరే ఖుద్ బశనాసి" అనగా అయాజ్ ముందు నీవు నీ విలువను, స్థాయిని గుర్తుంచుకో, పేర్లు దాచుకునే వారు తమ పేర్లను గోప్యముగా ఉంచుకొని ఇతరులపై ఫిర్యాదులు చేస్తుంటారు. అలాంటి వారి స్థాయి ఎక్కడున్నదో ఆలోచించుకోవాలి. అందుకే అలాంటి వారి ఆధారాలు కూడ వారు ఏ వంశమునకు చెందినవారైనను వారి ఆధారాలకు ఎలాంటి ప్రాధాన్యత ఉండదు. వాస్తవానికి ఫిర్యాదులు చేయువారే స్థాయి రహితులు. మనము అల్లాహ్ తాలా ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలి. అల్లాహ్ తాలాయే మా పోషకుడు, ప్రతి ఒక్కరి పోషకుడు, అతడే అహారమును నొసంగును. అతడే పోషించును. మనము ప్రతి ఒక్కటి అల్లాహ్ తాలా నుండే పొందుచున్నప్పడు మనము ఆరోపించువారి ఆరోపణలను కాకుండా కేవలం అల్లాహ్ తాలా ఆదేశాలపైనే నడుచుకోవాలి. నేను ముందు తెల్పినట్లుగానే ఇతరులను శాసనము ప్రకారము శిక్షించాలని ఈ ఫిర్యాదులు చేయువారు కోరుకుంటారు కాని, తమను తాము శాసన ఆదేశాల నుండి స్వతంత్రులుగా, నిర్దోషులుగా భావించుకొంటారు. తమకు తామే న్యాయ మూర్తులవుతారు. కాని వారి వాస్తవము బయటపడగానే ఇటువంటి వారికి కూడ శాసనము ప్రకారమే శిక్ష విధించబడును.

కొన్ని విషయాలలో సాక్షుల అవసరముండును. సాక్షులను ప్రవేశ పెట్టినిచో ఆ విషయమునక ఎలాంటి ప్రాధాన్యత ఉండదు. శాసనము మరియు పవిత్ర ఖుర్ఆన్ ప్రకారమే తీర్మానము చేయబడును. అతడు అసత్య ప్రమాణము చేసి తనను తాను తప్పించుకొన్నాడని కొందరందురు.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు ఒకసారి ఇటువంటి సమస్య వచ్చినప్పడు ఇద్దరు జగడమాడు వారు వచ్చిరి. అప్పడు వారు (స) ఇట్లనిరి. అల్లాహ్ తాలా ఆదేశము మేరకు నేను తీర్మాణము చేయుదును, కాని ఎవరైన అసత్య ప్రమాణములు చేసినచో వారి వ్యవహారము అల్లాహ్ చేతిలో ఉండును. అతడు వారిని శిక్షించును.

(సేకరణ: ఖుత్బాతే మహమూద్, సంపుటి 33, పుట 265-271)

కావున ఒక వ్యక్తి ఫిర్యాదు చేస్తూ, తాను నిర్దేశించిన నిబంధనల మేరకే శిక్షించాలని కోరినచో అలా ఎన్నడు జరుగదు. ఫిర్యాదు చేసినప్పడు అందుకు తీర్మాణం దేవుని నిర్దేశిత ప్రామాణికము ప్రకారమే చేయబడును. ఎక్కడైతే ఇరువురి సాక్ష్యాలను ప్రవేశపెట్టవలసియుండునో అక్కడ ఇరువురి సాక్ష్యాలను ప్రవేశ పెట్టవలెను. ఎక్కడైతే నలుగురి సాక్ష్యాలను ప్రవేశ పెట్టవలెనో అక్కడ నలుగురి సాక్ష్యాలు ప్రవేశపెట్టవలెను. దానిని అనుసరించే పరిశీలన ముందుకు సాగును. ఆ తరువాత శిక్ష విధించబడును. అల్లాహ్ తాలా ఆదేశానుసారమే మనము మన సమస్యలలో తీర్మాణం చేయించుకొను వారుగా మారవలెను. తమ పేరు ప్రతిష్టను, ప్రాధాన్యతలను పునాదిగా చేసుకొని తమకు అనుకూలంగా తీర్పు చేయించుకొనుటకు జమాఅత్ వ్యవస్థపై మరియు వర్తమాన ఖలీఫా గారిపై ఎలాంటి ఒత్తిడిని తీసుకరాకూడదు. అల్లాహ్ తాలా ఫిర్యాదులు చేయువారికి వివేకమును ప్రసాదించు గాకా!. వాస్తవానికి జమాఅత్ వ్యవస్థకు నష్టము వాటిల్లుచున్నదని భావించినచో ధైర్యముతో ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి. ఆ తరువాత ఎదరుయ్యే ప్రతి సమస్యను ఎదురించాలి. అన్ని విధాలా న్యాయబద్ధముగా అల్లాహ్ తాలా ఆదేశములను పాటించుచూ సున్నత్ ప్రకారము నిర్ణయము తీసుకొనుటకు మరియు వర్తమాన ఖలీఫా ద్వారా తీర్మాణము చేయుటకు నియమించబడిన వారందరిని అనుగ్రహించు గాకా!. (ఆమీన్)

జుమా నమాజ్ తదుపరి నేను కొన్ని పరోక్ష జనాజ నమాజ్‌లను చదువించెదను. ప్రథమ జనాజ నమాజ్ గౌ॥ సాజిద్ ముహమ్మద్ తండ్రి గౌ॥ షేక్ మజీద్ అహ్మద్ గారిది. వీరు కరాచి జిల్లా, గుల్జార్ హిజ్రి ప్రాంత నివాసులు. అహ్మదీయ్య వ్యతిరేకులు వీరిని నవంబర్ 27, 2016న మఘ్‌రిబ్ నమాజ్ తరువాత ఇంటి ముందు బైక్‌పై కూర్చొని ఉండగా కాల్చి చంపిరి. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. నివేధిక ప్రకారము., షేక్ సాజిద్ గారు గుల్‌సన్ ముఅమ్మారు కరాచిలో ఫ్లోర్ మిషనరి స్పేయిర్ పార్ట్ సప్లై చేసేవారు. నవంబర్ 27, 2016నాడు మఘ్‌రిబ్ నమాజ్ సమయంలో మార్కెట్ నుండి ఇంటి సరుకులు తీసుకవచ్చి బైక్ నుండి క్రిందికి దిగే సమయంలోనే కొందరు దుండగులు బైక్‌పై వచ్చి వారిపై కాల్పులు జరిపిరి. అంతటితో ఆగకుండా బైక్‌పై వెళ్ళుచు మరల నాలుగు రౌండ్లు కాల్పులు జరిపిరి. కాల్పుల వలన ఒక బుల్లెట్ సాజిద్ మహమూద్ చాతిలో కుడి భాగం నుండి దూసుకెళ్లి వెనుక భాగం ఎడమవైపు నుండి బయటకు వెళ్లినది. మరొక బుల్లెట్ కాలికి తగిలినది. సాజిద్ మహమూద్ గారిని వెంటనే సమీపంలోని హాస్పటల్‌లో చేర్పించడం జరిగినది. అయినా కూడ వారిని కాపాడుకోలేక పోయారు. వైద్యం ప్రారంభించడానికి ముందే వారు అమరులైరి. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. వారి కుటుంబములో అహ్మదియ్యత్ వారి ముత్తాత షేక్ ఫజ్లే కరీం గారి ద్వారా వ్యాపించినది. వారు 1920వ సంవత్సరంలో రెండవ ఖలీఫా గారి హస్తములపై బైఅత్ చేసి అహ్మదియ్యత్‌ను స్వీకరించిరి. అమరుని తండ్రి గారు షేక్ మజీద్ అహ్మద్ గారు దేశ విభజన సమయంలో కాన్పూర్ నుండి లాహోరుకు వలస వెళ్లిరి. 1961లో మరల కరాచిలో స్థిర నివాసం ఏర్పర్చుకొనిరి. అమరుని తాతా గౌ॥ కీ॥ శే॥ ఖ్వాజా ముహమ్మద్ షరీఫ్ గారు జమాఅత్ అహ్మదియ్య దిల్లిలోని లాహౌర్ దర్వాజా ప్రాంతానికి చాలా కాలం వరకు సదరుగా సేవలందించిరి. వారి ముత్తాత (అనగా తల్లి గారి తాతా) హజ్రత్ అలా ఉద్దీన్ గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అనుచరులు. అదే విధముగా గౌ॥ సేట్ ముహమ్మద్ సిద్దీఖ్ బాని కలకత్తా గారు అమరుని శ్రీమతి యొక్క తాతా ( తల్లి గారి తండ్రి) గారు. అమరుడు బి.ఏ వరకు విద్యాభ్యాసం చేసెను. 5 సంవత్సరములు ఎంతో కష్టముగా జీవితము గడిపెను. ఆ తరువాత ఫ్లోర్ మిషనరి యొక్క విడి భాగాల పంపిణి వ్యాపరమును ప్రారంభించెను. ఆ వ్యాపారములో అల్లాహ్ తాలా చాలా శుభములను చేకూర్చెను. అంతేగాకా వారి వ్యాపారము కూడ చాలా విస్తరించిపోయెను. అమరుని కుమారుడు హారీస్ ముహమ్మద్ గారు ప్రాంతీయ యువకుల సమితికి ఉప అధ్యక్షులుగా మరియు కరాచిలోని గుల్షనే ఎక్బాల్ ప్రాంతానికి వసియ్యత్ సెక్రటరిగా సేవలందించు చుండిరి. వారి కుమారుడు ఏ.సి,సి.ఏ పూర్తి చేసిన తరువాత తండ్రి గారి వ్యాపారమునే కొనసాగించు చుండిరి. అమరునిలో అనేక సుగుణాలు గలవు. అదే విధముగా అమరుని కుమార్తె సనా ముబష్షిరత్ కూడ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నది. 6 నెలల కోర్సు కోసం అమెరికా వెళ్ళుటకు కూడ వారికి అవకాశం లభించినది. వారు ఆ కోర్సు పూర్తి చేసుకొని తిరగి వచ్చిరి. అమరుడు ఖిలాఫత్ పట్ల ఎంతో అభిమానాన్ని, అనుబంధము ను కల్గి యుండేవారు. వారి సంతానాన్ని కూడ ఖిలాఫత్ మరియు అహ్మదియ్య వ్యవస్థతో అనుబంధమును కల్గి యుండుటకు ప్రోత్సాహించేవారు. తమ శక్తి సామార్థ్యములకు మించి చందాలు చెల్లించుటకు ప్రయత్నించేవారు. వారి కుమారునికి కూడ ఆ విధానమును అనుసరించాలని ప్రోత్సాహించేవారు. ఎల్లప్పడు చందా చెల్లించాలానే

ఆలోచనలోనే ఉండేవారు. చందా డబ్బులు ప్రోగు చేయడం కోసం ఒక బాక్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అందులో క్రమం తప్పకుండా చందా డబ్బులు వేసేవారు. లావాదేవిల విషయంలో ఎంతో నిజాయితితో, విశ్వాసభరితముగా ఉండేవారు. నిజాయితిని, క్షమాగుణంను ఎల్లప్పుడు పాటించేవాడు. సోదర సోదరిమణులను ఏనాడు కోపగించుకోలేదు, పైగా అందరి పట్ల దయా గుణంను కల్గి ఉండేవారు. అమరుడు ఎంతో స్వచ్ఛమైన, సద్భావనమైన ఆలోచనలు కల్గియుండేవారు. రక్త సంబంధీకుల పట్ల ఎంతో అన్యోన్యతను చూపించేవారు. అమరులు తమ రెండు దుకాణాలను వారి కీ॥ శే॥ తండ్రి మరియు మామ గారి పేర్లపై నడపసాగిరి. వారి భార్య తరుపు బంధువులతో కూడ ఎంతో అన్యోన్యముగా ఉండేవారు. మిత్రులతో, బంధువులతో మనస్పూర్తిగా కలిసేవారు. వారి హృదయంలో ఎలాంటి పగ, కుట్రలు వంటివి ఏ మాత్రం కనిపించవు. నేను తెల్పిన ఈ సులక్షణాలనే, వారి ఉత్తమ ప్రవర్తనలను గూర్చియే అనేకులు నాకు తెల్పుచు ఉత్తరములు వ్రాసిరి. అమరుని తల్లి గారు గత కొన్ని రోజులుగా అనారోగ్యముతో బాధ పడుచున్నది. వారి అనారోగ్య కారణాల వలన వారి కుమారుని అమరత్వంను గూర్చి తెలుపుట కష్ట తరమయ్యెను. కాని వారికి ఈ విషయం తెలిసినప్పుడు వారి పార్థివ దేహంను చూసినప్పుడు నా కుమారుడు అమరుడైనాడు కావున ఎవరు రోధించరాదని అందరిని హెచ్చరించిరి. ఆ పదాలను పదే పదే ఉచ్చరించే వారు. అమరుని శ్రీమతి కూడ ఎంతో ధైర్యముతో వారి భర్త అమరత్వంను గూర్చి విని ఎంతో ఓర్పును, సహనంను పాటించిరి. వారి కుమారుడు ఇలా వ్రాసిరి: మా తండ్రి గారి స్వభావంలో నిశ్చలత్వం, అల్లాహ్‌పై ఎంతో పటిష్టమైన విశ్వాసం ఉండేది. అల్లాహ్ తాలా నాకు నేనే నమ్మలేనంతగా నాకు గౌరవాన్ని ఇచ్చినాడని పదే పదే మా త్రండి గారు అనేవారు. క్రమం తప్పకుండా నమాజ్‌లు సల్పేవారు. వారి బంధువులు కూడ వారిని గూర్చి సాధారణ వ్యక్తిత్వం గలవారు, అందరి అవసరాలను దృష్టి యందుంచుకునేవారు. అమరునికి 11 మంది సోదర సోదరీమణులు గలరు. అందరు తమ తమ జీవిత భాగస్వామీలతో, పిల్లా పాపలతో సంతోషంగా జీవితం గడుపుచున్నారు. అమరుడు అందరి పట్ల ప్రేమానురాగాలు చూపించే వాడు. జిల్లా సిక్రాలో జమాఅత్ పరిస్థితులు సరిగా లేనప్పుడు, అధికులు వీర మరణం పొందుచున్నప్పుడు ఈ అమరుడు ఎన్నోసార్లు ఆ ప్రాంతములో డ్యూటిలు ఇవ్వడం కోసం వెళ్లేవారు. వారి అమరత్వం తరువాత వారి కుమార్తె ఒక రోజు స్వప్నంలో వారి తండ్రిని చూసి ఇట్లు తెల్పిరి: ఒక విశాల వంతమైన తోటలో తేజోవంతమైన ముఖములు గలవారు ఎందరో తెల్లటి వస్త్రములు ధరించి ఉన్నారు. వారిలో తండ్రి గారు కూడ ఉన్నారు. వారు ఉన్నతమైన స్థానంలో ఉన్నారు. అందరు తండ్రి గారిని చుట్టు ముట్టారు. మరియు ఆనందమును వ్యక్త పర్చుచుండిరి. తండ్రి గారు ఒక వైపు వెళ్ళుచుండగా అందరు ఒక బృంధము వలే వారిని అనుసరిస్తుండిరి. అందరు వారి తండ్రి గారిని చూసి సంతోషంను వ్యక్త పర్చుచుండిరి. నేను ముందుగా తెల్పినట్లు అమరుని తల్లి గారు వృద్ధాప్యమునకు చేరినది. కాలు కదపలేని పరిస్థితి. అమరత్వం పొందిన తరువాత అమరులు వారి తల్లిగారికి స్వప్నంలో కనిపించి నేను ఇక్కడ చాలా సంతోషంగా ఉన్నాను, సంతృప్తిగా ఉన్నాను. నా గురించి మీరెవ్వరు కూడ ఆందోళన చెందకూడదని తెలియజేసిరి. అమరులు వారి జ్ఞాపకార్థం వారి తల్లిని, వారి శ్రీమతి మన్సూర యాస్మీన్ గారిని, కుమారుడు హారిస్ మహమూద్, కుమార్తె సనా ముబష్షిరాతో పాటు నలుగురు సోదరులు, ఆరుగురు సోదరీమణులను వదలి వెళ్లిరి. అల్లాహ్ తాలా అమరుని స్థాయిని పెంచు గాకా!. వారి సంతానాన్ని కూడ వారి అడుగుజాడలో నడిపించు గాకా!. (ఆమీన్)

రెండవ జనాజా నమాజ్ గౌ॥ షేక్ అబ్దుల్ ఖాదర్ తండ్రి షేక్ అబ్దుల్ కరీం దర్వేష్ ఖాదియాన్ గారిది. వీరు నవంబర్ 26, 2016న హృదయ స్పందన ఆగిపోవడం వలన 92 సంవత్సారాల వయస్సులో పరమపదించిరి. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. వారి వంశంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి అనుచరులు గౌ॥ అబ్దుల్లా సన్నూరి గారి ద్వారా వ్యాపించినది. 1947 నవంబర్‌లో ఖాదియాన్ నుండి చివరి బృంధము పాకిస్తాన్‌కు వెళుచుండగా వీరు అనారోగ్యముతో ఉన్న వారి తల్లి గారిని వెంట బెట్టుకొని వాహనంలో కూర్చొనిరి. కాని ఖాదియాన్ పొలిమేరల వరకు వాహనం చేరుకోగానే వారి తల్లి గారు వీరిని ఖాదియాన్ రక్షణ కోసం వాహనం నుండి క్రిందికి దించిరి. ఆ విధముగా వీరికి దర్వేష్ జీవితంను పొందు భాగ్యము లభించినది.

వీరికి జమాఅత్ వ్యవస్థ మరియు ఖిలాఫత్ పట్ల అత్యంత అభిమానం ఉండేది. అల్లాహ్ తాలాపై పూర్తి నమ్మకం ఉండేది. ప్రతి విజయమును, ప్రతి అపజయమును అల్లాహ్ తాలా ప్రీతికనుగుణమని భావించి స్వీకరించేవారు. వారి భార్య పిల్లలు, బంధు మిత్రులతో సగౌరవంగా నడుచుకునే వారు. వారి చివరి వయస్సు వరకు వారి పనులు వారే స్వయంగా చేసుకునేవారు. వీరికి సదర్ అంజుమన్ అహ్మదియ్య కార్యలయపు అనేక శాఖలలో సేవలందించే భాగ్యము లభించినది. వారి కుమారుడు ఇలా వ్రాసిరి: జల్సా సాలానను దృష్టి యందుంచుకొని ఇంటికి సున్నం వేయించుటకు సిమెంట్ వంటి తదితర సామాగ్రిని కూడ తెప్పించినారు. ఆ రోజు రాత్రియే మమ్ము పిలిచి నా సమయం ఆసన్నమైనట్లు అనిపిస్తుంది. ఫలాన వ్యక్తి వద్ద నేను 500 రూపాయలు తీసుకున్నాను వాటిని తిరిగి ఇచ్చేయండి అని ఇతర లావా దేవీల గూర్చి కూడ తెల్పి, కొంత సమయానికే అల్లాహ్ సన్నిధికి వెళ్లిపోయిరి. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. వారి జ్ఞాపకార్థం ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు గలరు, వారి కుమారుడు నాసిర్ వహీద్ గారు జమాఅత్ సేవలో నిమగ్నమై ఉన్నారు.

మూడవ జనాజ తన్వార్ అహ్మద్ లోన్, నాసిరా బాద్, కాశ్మీర్ గారిది. వీరు దేశ సరిహద్దు సైన్యంలో పని చేయుచున్నారు. నవంబర్ 25, 2016న కార్యనిర్వాహణలో ఉండగానే, సదర్ జిల్లా, కోల్గామ్ ప్రాంతములో శత్రు దేశస్థుల కాల్పుల వలన వీరు వీర మరణం పొందిరి. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. ఈ అమరుడు నమాజ్ మరియు ఉపవాసాలను క్రమం తప్పకుండా ఆచరించేవాడు. సహృదయులు, స్నేహ భావం కలవారు. విధేయుత కలవారు, ప్రజా శ్రేయస్సును కోరుకునేవారు, ధైర్యవంతులు, అల్లాహ్ తాలాపై పూర్తి నమ్మకంను కలవారు. ఆర్థిక త్యాగాలలో ఎల్లప్పుడు ముందుండే వారు. చందాలను క్రమం తప్పకుండా, ప్రామాణికముగా, అధికముగా చెల్లించువారు. వారి సోదర సోదరిమణులకు సహాయం చేసేవారు. వారి విద్యా, శిక్షణ విషయం పూర్తిగా శ్రద్ధ తీసుకునేవారు. వాస్తావానికి కూడ వారు తమ పొరుగు వారి హక్కులను చెల్లించేవారని వారు పొరుగు వారు తెలుపేవారు. వారి సహోద్యోగులు వారిని గూర్చి ఎల్లప్పుడు తమ డ్యూటి పట్ల అప్రమత్తముగా ఉండేవారు, తమ కార్యనిర్వాహణలో ఏనాడు అలసత్వం వహించలేదని తెల్పిరి. వారి కుటుంబములో వారి తల్లితో పాటు ఇద్దరు సోదరిమణులు, ఆరుగురు సోదరులు, శ్రీమతి, ముగ్గురు పసిపిల్లలు ఉన్నారు. వారి కుమారులలో ఒకరు వఖ్ఫే నౌ తహరీఖ్‌లో చేర్పించ బడ్డారు. అల్లాహ్ తాలా అమరుని స్థాయిని పెంచుగాకా!. వారి సంతానానికి కూడ జమాఅత్ మరియు ఖిలాఫత్ పట్ల ఎల్లప్పుడు అభిమానాలను కల్గియుండే భాగ్యము కల్పించుగాకా!, వారికి సత్కార్యములు చేయు అవకాశం కల్పించుగాకా!. వారి సంరక్షణ భాధ్యతలు స్వయముగా అల్లాహ్‌యే చేపట్టును గాకా!.

**విశ్వాసమును అంగీకరించుచు సత్కార్యమును పొందుటకు దుఆ**

رَبَّنَآ اٰمَنَّا فَاكْتُبْنَا مَعَ الشّٰهِدِيْنَ ۝٨٤ وَمَا لَنَا لَا نُؤْمِنُ بِاللّٰهِ وَمَا جَآءَنَا
مِنَ الْحَقِّ ۙ وَنَطْمَعُ اَنْ يُّدْخِلَنَا رَبُّنَا مَعَ الْقَوْمِ الصّٰلِحِيْنَ ۝٨٥

"ఓ మా పోషకుడా! మేము విశ్వసించితిమి, కనుక మమ్ము సాక్ష్యమిచ్చువారిలో వ్రాసుకొనుము. మేము అల్లాహ్‌ను మా వద్దకు వచ్చిన సత్యమును విశ్వసించక యుండుటకు మాకేమయ్యెను. మా పోషకుడు మమ్ములను సన్మార్గముల వర్గములో చేర్చునని మేము ఆశింతుము. (అల్ మాయిద్‌హ్: 84,85)

దుఆలు కోరుచు: సేఠ్ ముహమ్మద్ బషీరుద్దీన్ జమాఅత్ మాజీ రాష్ట్రాధ్యక్షులు ఆం.ప్ర.
మరియు కుటుంబీకులు: హైద్రాబదాద్




ప్రొ॥ ముహమ్మద్ సలీమ్
9949356387
9949146660
Love for All Hatred for None
# మస్రూర్ హోటల్
టీ, టిఫిన్, మీల్స్, చికెన్ బిర్యాని, ఫాస్టు ఫుడ్ లభించును.
నాయుడు పెట్రోల్ పంపు, ఖమ్మం రోడ్, వరంగల్, తెలంగాణ
**అన్ని కంపెనీల సెల్ రిచార్జ్‌లు చేయబడును.**

# జుమా ప్రసంగము

ఎవరి కనులపై ముసుగు పడియున్నదో, మేము నమ్మమని నిర్ణయించుకున్న వారికి అల్లాహ్ తాలా సహాయములు, సంకేతములు కనిపించవు. ప్రవక్తలను నిరాకరించు వారి పద్ధతి ఆది నుండి కొనసాగుచున్నదేమనగా సంకేతములను చూచి కూడ మాకు సంకేతములు చూపమని అందురు. వారు హద్దులు దాటిపోయినందున అల్లాహ్ తాలా వారి హృదయములను మూసివేయును. కనుక వారు సత్యమును పొందలేరు. కొన్ని సార్లు ప్రవక్తకు సహకారము అందించుచు అల్లాహ్ తాఆల వారిని గుణపాఠ సంకేతముగ చేయును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ సత్య నిదర్శనము కోసం అల్లాహ్ తాలా యొక్క అనేక సంకేతములను వారి (అ) హక్కులో పూర్తి గావించబడినవి చూపిరి. ఆ తరువాత తమ హక్కులో పూర్తి గావించబడిన హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి భవిష్యవాణులను కూడ చూపిరి. కాని ఈ ధార్మిక గుత్తాధిపతులు స్వీకరించకపోవడమే గాకా, సమాజంను కూడ మార్గ భ్రష్టులను చేసిరి..

అది ప్రతి రోజు పూర్తి అగుచున్న ఒక మహా గొప్ప సంకేతమును గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెల్పుచూ ఇట్లనిరి. అల్లాహ్ తాలా నాకొక దుఆ సువార్తవాణి ద్వారా నేర్పించెను. ఆ దుఆ బరాహీనే అహ్మదియ్యాలో గలదు. **"రబ్బి లా తజ్ఱ్నీ ఫర్దన్ వ అంత ఖైరుల్ వారిసీన్"** అనగా నన్ను ఒంటరిగా వదలకుము. ఒక సమూహమును సిద్ధము చేయుము.

గత కొద్ది రోజుల క్రితం రబ్వాలో తహ్రీకె జదీద్ కార్యాలయములు, జియావుల్ ఇస్లామ్ ప్రెస్ పై ప్రభుత్వ పోలీసు ప్రత్యేక సంస్థ దాడి చేసి ఇద్దరు మురబ్బిలను, మరికొందరు కార్యకర్తలను తీసుకెళ్లినారు. స్పందనగా కొందరు రబ్వాను నుండి నాకు ఉత్తరము వ్రాసినారు. వీరిలో స్త్రీలు కూడ యున్నరు. మేము ఈ విషయములతో భయపడే వారము కాదు. మా విశ్వాసములు గట్టిగా యున్నవి, సదా యుండును. ఈ సంఘటనను చూచినను మేము ప్రతి కష్టమును ఎదురింతుము, ప్రతి త్యాగమును సమర్పింతుము. ఈ స్ఫూర్తియే ప్రతి విశ్వాసునిలో యుండవలెను.

మనము రోజు అల్లాహ్ తాలా సహాయపు క్రొత్త క్రొత్త దృశ్యములను చూస్తున్నాము. ఇతర ప్రజలు ఇతర జాతులు పూర్తిగా సాధారణ స్థాయికి దిగజారి పోయిన ఆ దృశ్యములను కూడ మనము చూచెదము. ఇన్ షా అల్లాహ్. కాని మనలో, మన సంతానములో కూడ ధార్మిక స్ఫూర్తి నింపుకొవలసిన అవసరము మనకు గలదు. తద్వారా అల్లాహ్ తాలా మనకి దృశ్యములను చూపును.

కావున నేడు కూడ దిల్లి జమాఅత్ సభ్యులు వివేకంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సందేశమును అందించుటకు ప్రణాళికలు రూపొందించు కోవాలి. దేవుని దయ వలన పుస్తక ప్రదర్శనశాలల ద్వార సందేశం చేరవేయు అంశంలో చాలా వరకు ముందున్నారు. కాని ఇతర ముస్లింల నుండి వ్యతిరేకత కూడ వచ్చును. కావున వారికి కూడ తప్పని సరిగా ఈ సందేశాన్ని అందజేయాలి. వీటన్నింటికన్న ముఖ్యమైనది దుఆ,

**సయ్యిద్నా అమీరుల్ ముమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్**
**క్రీ.శ. 09 డిసంబర్ 2016 ( 09 ఫతహ్ 1395 హి.షు) తేదీన మస్జిద్ ఫజల్, లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

ఎవరి కనులపై ముసుగు పడియున్నదో, మేము నమ్మమని నిర్ణయించుకున్న వారికి అల్లాహ్ తాలా సహాయములు, సంకేతములు కనిపించవు. ప్రవక్తలను నిరాకరించు వారి పద్ధతి ఆది నుండి కొనసాగుచున్నదేమనగా సంకేతములను చూచి కూడ మాకు సంకేతములు చూపమని అందురు. వారు హద్దులు దాటిపోయినందున అల్లాహ్ తాలా వారి హృదయములను మూసివేయును. కనుక వారు సత్యమును పొందలేరు. కొన్ని సార్లు ప్రవక్తకు సహకారము అందించుచు అల్లాహ్ తాఆల వారిని గుణపాఠ సంకేతముగ చేయును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వ్యతిరేకులు కూడ ఇలానే యుండిరి. చూచిన కూడ తమ మొండి తనము వలన వారికి ఎలాంటి సంకేతము కనిపించేది కాదు. ఇలాంటి అవిశ్వాసులు, మరికొందరు గుణపాఠ సంకేతముగా నిలుచుదురు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ సత్య నిదర్శనము కోసం అల్లాహ్ తాలా యొక్క అనేక సంకేతములను వారి (అ) హక్కులో పూర్తి గావించబడినవి చూపిరి. ఆ తరువాత తమ హక్కులో పూర్తి గావించబడిన హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి భవిష్యవాణులను కూడ చూపిరి. కాని ఈ ధార్మిక గుత్తాధిపతులు స్వీకరించకపోవడమే గాకా, సమాజంను కూడ మార్గ భ్రష్టులను చేసిరి.. నేటికి కూడ ఈ మార్గమునే వారు అవలంభించుచున్నారు. ఈ సంకేతములను ప్రస్తావిస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమాఅత్ సత్యమును నిరూపించుటకు అనేక సందర్భాలలో అనేక నిదర్శనాలను చూపినారు. వారు (అ) చూపిన నిదర్శనాలను హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ కాలపు నిదర్శనములుగా పేర్కొన్నట్లు ఆధారాలు కూడ చూపిరి. వాటిలో కొన్ని నిదర్శనాలను గూర్చి వారు(అ) విపులీకరించిరి. వాటిలో ఒకటి ఉదా॥ చంద్ర, సూర్య గ్రహణ సంకేతము. ఈ సంకేతము పూర్తి కానంత వరకు మౌల్వీలు రోధించుచు ఈ హదీసును చదివేవారు. కాని ఈ సంకేతము ఒక్క సారి కాక రెండు సార్లు ఒక సారి ఈ భారత దేశములో, రెండవ సారి అమెరికాలో పూర్తి అయినపుడు ఈ సంకేతమును కోరిన వారే నిరాకరించిరి. ఈ సంకేతమును నిరాకరించలేదు ఎందుకనగా ఈ సంకేతము బహిర్గతమైనది. కాని వారు తమ మొండి వైఖరిని మాత్రం వీడలేదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తన మిత్రుడు ఒకరు చెప్పిన విషయాన్ని తెల్పుచూ ఇట్లనిరి. ఈ సంకేతము పూర్తి అయినప్పుడు గులాం ముర్తజా పేరు గల ఒక మౌల్వీ చంద్ర సూర్య గ్రహణ సందర్భమున తన తొడలపై చేతులు కొట్టుచు ఎంతో బాధ, దు:ఖము బహిర్గతము చేయుచు ఇప్పుడు ప్రపంచము మర్గ భ్రష్టమైనదని కలత చెందెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ తాలాను మించి అతడు ప్రపంచము పట్ల ఎక్కువ శ్రేయోభిలాషియా? గమనించుము. ఇదే విధముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సహాయములో మహమ్మారి సంకేతము కూడ యుండెను. కాలువలు తీయబడు సంకేతము కూడ యుండెను. పవిత్ర ఖుర్ఆన్ లో గల ఈ భవిష్యవాణులు అనగా నూతన జనావాసముల సంకేతము కూడ యుండెను. పర్వతములను పగులగొట్టు సంకేతము కూడ యుండెను. పుస్తకములు, వార్తల ప్రచురణ సంకేతములు కూడ యుండెను. క్రొత్త క్రొత్త వాహనముల సంకేతములు యున్నవి. వారు (అ) ప్రస్తావించిన అనేక సంకేతములు గలవు. వాటిని గూర్చి పవిత్ర ఖుర్ఆన్‌లో

గలదు. ఆ( హజ్రత్ సల్లల్లాహు అలైహి వస్సలాం కూడ తెలిపిరి.

(సేకరణ: మల్ఫూజాత్ సంపుటి9, పుట 157-158)

హజ్రత్ ముస్లిహ్ మౌవుద్ (ర.అ) ఇట్లనిరి. ప్రజలు అల్లాహ్ తాలా సంకేతములు, సహాయములను చూచే బదులు హజ్రత్ మసీహ్ మౌవుద్ అలైహిస్సలాతు వస్సలాం పై చిన్నచిన్న హాస్యస్పద విమర్శలు చేస్తారు. వాస్తవానికి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనేక నిదర్శనాలను చూపిరి. కాని కొందరు వారిని కలువాడానికి వచ్చి, వారి తలపాగ వంకర యున్నది, వీరేలా వాగ్దత్తా మసీహ్ కాగలరని అనేవారు. వారు మహిమ తరువాత మహిమ చూపించిరి. అయినను వీరు ఖాఫ్ సరిగా చదవలేరు వీరెలా వాగ్దత్త మసీహ్ కాగలరని కొందరు అనేవారు. సంకేతము తరువాత సంకేతము చూపినను, వీరు భార్య కొరకు ఆభరణమును చేయించినారు, వీరు బాదామ్ రోఘన్ వాడుతారు. వీరినెలా మేము నమ్మగలము అనేవారు. అందుకే ఇలాంటి వారిని గూర్చి హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) దేవుని సంకేతములను చూడకుండా తమ కన్నులు మూసుకొన్న వారని తెలుపేవారు. అనేక మంది హజ్రత్ మసీహ్ మౌవుద్ అలైహివస్సలాం వద్దకు వచ్చి సంకేతములను చూపమని అడిగేవారు. అందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గత సంకేతములతో మీరే లబ్ధి పొందినారు, గత వేలాది సంకేతముల నుండి మీరు ఎలాంటి లబ్ధి పొందనప్పుడు మరో దానితో ఎలా లబ్ధి పొందగలరని వారిని ప్రశ్నించేవారు. ఇలాంటి వారు ఎల్లప్పుడు దురదృష్ట వంతులుగానే ఉంటారు. వారి జాతకంలో దురదృష్ట వంతులనే వ్రాసి యున్నది.

(ఖుత్బాతే మహ్మూద్ సంపుటి 11, పుట 224-225)

అది ప్రతి రోజు పూర్తి అగుచున్న ఒక మహా గొప్ప సంకేతమును గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెల్పుచూ ఇట్లనిరి. అల్లాహ్ తాలా నాకొక దుఆ సువార్తవాణి ద్వారా నేర్పించెను. ఆ దుఆ బరాహీనే అహ్మదియ్యాలో గలదు. **"రబ్బి లా తజ్ర్నీ ఫర్దన్ వ అంత ఖైరుల్ వారిసీన్"** అనగా నన్ను ఒంటరిగా వదలకుము. ఒక సమూహమును సిద్ధము చేయుము. ఈ అనువాదమును స్వయముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారే చేసినారు. మరో చోట ఇట్లనిరి. **" యాతీక మిన్ కుల్లి ఫజ్జిన్ అమీక్ "** అనగా అతిథులకు అనివార్యముగా అవసరమున్న వస్తు సామాగ్రిని నలు వైపుల నుండి అల్లాహ్ తాలా స్వయముగా సమకూర్చును. మరొక చోట ఇట్లు గలదు, **" యాతీన మిన్ కుల్లి ఫజ్జిన్ అమీక్"** అనగా వారు అన్ని మార్గముల నుండి నీ వద్దకు వచ్చెదరు.

అన్ని మార్గాల నుండి, నలు దిక్కుల నుండి అతిథులు నీ వద్దకు వచ్చెదరు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మరల ఇట్లు తెల్పిరి: 26 సంవత్సరాల క్రితం ఈ భవిష్యవాణిని ప్రకటించాను. అది నేటికి ఎంతో వైభవముగా పూర్తి అగుచూనే ఉన్నది. ఇది జమాఅతే అహ్మదియ్య అభివృద్ధిని గూర్చి చేసినటు వంటి భవిష్యవాణి. వారి జమాఅత్ ప్రతి రోజు పెరుగుట, ధన త్యాగములో ప్రజలు ముందడుగు వేయుటను వారి సత్యమునకు ఒక అద్భుతమైనా నిదర్శనముగా మనము చూస్తున్నాము. ఇదొక సంకేతము. కాని చూచే కనులు యున్నవారికే కనిపించును, అంధులకు కనిపించదు.

అహ్మదియ్యత్ విజయము, జమాత్ అభివృద్ధి గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహివస్సలాం పలు దైవవాణీలను హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర.అ) ప్రస్తావించినారు. వాటిలోని కొన్నింటిని నేను ఇప్పుడు ప్రవేశపెట్టుచున్నాను. వీటిని వారే (ర) ఆధారాలుగా గుర్తించిరి. వారిట్లనిరి. గత ప్రవక్తల సమాజం త్యాగములు చేసినట్లే అహ్మదీయ జమాత్ కూడ త్యాగములు చేయవలసివచ్చునని అల్లాహ్ తాలా పదే పదే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహివస్సలాంనకు తెలిపెను. ఒక సారి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహివస్సలాం సత్యస్వప్నములో ఇట్లు చూసిరి. నేను నిజాముద్దీన్ గృహములో ప్రవేశించినాను. నిజాముద్దీన్ అనగా ధర్మ వ్యవస్థ. ఈ సత్య స్వప్న అర్థమేమనగా అహ్మదియ్య జమాఅత్ ఒక రోజు పటిష్ట ధార్మిక వ్యవస్థగా మారును. ప్రపంచ వ్యవస్థలన్నింటిపై ఆధిపత్యం చెలాయించును. ఇన్షా అల్లాహ్. కాని ఈ ఆధిపత్యం ఎలా సాధ్యమగునో దానిని కూడ ఆ సత్య స్వప్నములో నే అల్లాహ్ తాలా తెల్పినట్లు వారు (అ) తెల్పిరి. ఆ మార్గమును గూర్చి తెల్పుచూ వారు (అ) ఇట్లనిరి. ఆ గృహములోకి మనలో కొందరు హుస్సేన్ విధానమును అనుసరిస్తూ, మరి కొందరు హసన్ విధానమును అనుసరిస్తూ ప్రవేశిస్తున్నారు. హజ్రత్ హసన్ (ర) సంధి మార్గమును ఎంచుకొని విజయము సాధించినట్లు, హజ్రత్ హుస్సేన్ (ర) ప్రాణాలను అర్పించి విజయము సాధించిన విషయము అందరికి తెలిసినదే కదా!.

నిజామొద్దీన్ స్థాయికి జమాఅత్ చేరును కాని, కొంచెం సంధి, అనురాగము, ఆప్యాయత, మరి కొంచెం ప్రాణాలర్పించి, త్యాగముల ద్వారా అని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహి వస్సలాంనకు తెలుపబడెను. సంధి, అనురాగము, ఆప్యాయలతో గాకుండా మన జమాఅత్ అభివృద్ధి చెందునని మనలోని ఎవరైనా భావించినచో వారు పొరపాటు చేస్తున్నట్లే. త్యాగములు, ప్రాణాలర్పించనిదే ఈ జమాఅత్ అభివృద్ధి చెందునని ఎవరైనా భావించినా అది కూడ పొరపాటగును. ఒకసారి సంధి,శాంతి వైపు పోవలసి యుండును, మరొకసారి హుస్సేన్ పద్ధతిని అవలంబించవలసి యుండును. దీని అర్థమేమనగా మనము శత్రువు ముందట మరణించవలసి వచ్చినను అతని మాట వినకూడదు. ఈ రెండు విధానాలు మన కోసం కేటాయించ బడినవి. అంతేగాని కేవలం మసీహ్ మార్గమును గాని, మహ్దీ మార్గమును అనుసరించినచో మనము విజయము సాధించలేము, ఆ రెండు మార్గాలలో మధ్య మార్గమును మనము అవలంభించ వలసి యుండును. ఒక విజయము సంధి, సామరస్యాలతో, మరొక విజయము ప్రాణ, ధన త్యాగాలతో లభించును. అప్పడే జమాఅత్ నిజామొద్దీన్ గృహములో ప్రవేశించును. అప్పడే పూర్తి విజయము సాధించినట్లగును. ( తఫ్సీరే కబీర్ సంపుటి7, పుట 583) ఈ రెండు విధానాలకు ఉదాహరణను నేడు జమాత్ సభ్యులు చూపుచున్నారు. సంధి, సామరస్యపు సందేశాలను మరియు ధర్మం కోసం త్యాగాలను జమాఅత్ సభ్యులే ఇస్తున్నారు.

మరొక చోట వారు (ర) ఇట్లు తెల్పిరి: హజ్రత్ మసీహ్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు సువార్త వాణి అందడమే గాకుండా స్వప్నంలో కూడ చూపించడం జరిగినది. ఈ విషయము కూడ పై సువార్త వాణికి చెందినదే. మస్జిద్ ముబారక్ కు సమీపంలో ఉన్న గృహము( మిర్జా నిజామొద్దిన్ గృహము)లోకి కొందరు హుస్సేని విధానములో, మరి కొందరు హసన్ విధానములో ప్రవేశిస్తున్నట్లు చూపడం జరిగినది. ఈ స్వప్నం గూర్చి తెలియగానే ఈ సువార్త వాణి అర్థం ఏమిటి? అని అనేకులు ఆశ్చర్యమునకు గురి అయినారు. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) మరల ఇట్లు తెల్పిరి: ఈ సువార్త వాణి యొక్క అర్థం ఏమిటో నాకు కూడ తెలియడం లేదు. కాని సమయానుకూలంగా దీని అర్థం దానికదే బహిర్గతమవుతుందని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలుపు చుండగా నేను స్వయముగా విన్నాను.

(ఖుత్బాతే మహమూద్ సంపుటి3, పుట 39-40)

ఆ కాలంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో ఒక్కరు కూడ ఉండేవారు కాదు. అయినా కూడ నీ జమాఅత్ ఎంతగా ప్రగతి చెందునానగా నేడు ఆదివాసీలుయుంటున్న విధముగా ప్రపంచములోని ఇతర జాతులు మారిపోవునని అల్లాహ్ తాలా నాకు తెలిపెను అని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహివస్సలాం తెల్పిరి.

(అన్వారుల్ ఉలూమ్ సంపుటి 9, పుట 213)

మనము రోజు అల్లాహ్ తాలా సహాయపు క్రొత్త క్రొత్త దృశ్యములను చూస్తున్నాము. ఇతర ప్రజలు ఇతర జాతులు పూర్తిగా సాధారణ స్థాయికి దిగజారి పోయిన ఆ దృశ్యములను కూడ మనము చూచెదము. ఇన్ షా అల్లాహ్. కాని మనలో, మన సంతానములో కూడ ధార్మిక స్ఫూర్తి నింపుకోవలసిన అవసరము మనకు గలదు. తద్వారా అల్లాహ్ తాలా మనకి దృశ్యములను చూపును. సహాయములు ఉన్నచోట వ్యతిరేకతలు కూడ యుండును. ప్రవక్తల పక్షములతో సదా ఇలాగే జరుగుతూ వచ్చెను. కాని ఈ వ్యతిరేకతలు భయపెట్టక విశ్వాసమును దృఢపరుచును, విశ్వాసమును పెంచుటకు కారణమగును.

గత కొద్ది రోజుల క్రితం రబ్వాలో తహ్రీకే జదీద్ కార్యాలయములు, జియావుల్ ఇస్లామ్ ప్రెస్ పై ప్రభుత్వ పోలీసు ప్రత్యేక సంస్థ దాడి చేసి ఇద్దరు మురబ్బిలను, మరికొందరు కార్యకర్తలను తీసుకెల్లినారు. స్పందనగా కొందరు రబ్వాను నుండి నాకు ఉత్తరము వ్రాసినారు. వీరిలో స్త్రీలు కూడ యున్నరు. మేము ఈ విషయములతో భయపడే వారము కాదు. మా విశ్వాసములు గట్టిగా యున్నవి, సదా యుండును. ఈ సంఘటనను చూచినను మేము ప్రతి కష్టమును ఎదురింతుము, ప్రతి త్యాగమును సమర్పింతుము. ఈ స్ఫూర్తియే ప్రతి విశ్వాసునిలో యుండవలెను. మీరు ఈ త్యాగాలు చేయక తప్పదని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కూడ తెలిపిరి. అల్లాహ్ తాలా వాగ్దానములు, అనేక సహాయక దృశ్యములను మనము చూస్తున్నాము. నిచ్చయముగా అంతిమ విజయము హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) జమాఅత్ నకె లభించును. వ్యతిరేకతలు ఎదురగుచున్నవి, ఎదురగును. దాడులు జరుపే ఈ నిస్సహాయులకు, అకస్మిక తనిఖీలు చేసే వీరికి, దాడులు అనకూడదు, అకస్మిక తనిఖీలు చేసేవీరికి కూడ అందరి కన్న అధిక భయము అహ్మదీయులతోనే కల్గుచున్నది. ఎందుకనగా దైవభీతిని కల్గించుకొనుము అని, అల్లాహ్‌కు భయపడుమని, అల్లాహ్ పట్టునుండి తమను తాము కాపాడుకొమ్ము అని అహ్మదీయులే వారిని హెచ్చరిస్తున్నారు. కావున వారి దృష్టిలో అహ్మదీయులు ఇలా ఎలా హెచ్చరించగలరు?. అల్లాహ్ తో భయపెట్టు అధికారము వారికి ఎక్కడిది?. అల్లాహ్ పేరున మమ్ము భయభ్రాంతులకు గురి చేయుచున్నందున వీరిని మించిన పెద్ద ఉగ్రవాదులు మరెవరుంటారు?. అందుకే వీరిని పట్టుకొనుము. హతమార్చుము.

అల్లాహ్ తాలా వారికి వివేకమును ప్రసాదించు గాకా!. యదార్థాన్ని గ్రహించు భాగ్యము కల్గించు గాకా!. యదార్థ ఉగ్రవాదులైన ఈ మౌల్వీల

నుండి అల్లాహు తాలా దేశమును రక్షించుగాక! వీరు దేశములో పీడనమును సృష్టించినారు. ఏ ప్రాణి కూడ వీరితో సురక్షితముగా లేదు. ఈ ప్రత్యేక పోలీస్ యంత్రాంగమునకు ఉగ్రవాదులను హతమార్చు శక్తినిచ్చు గాకా!. వీరు శాంతియుతంగా, ప్రేమాభిమానాలతో, దేశ చట్టాలకు లోబడి ఉన్న ఈ అహ్మదీయులపై చేయి వేయుటకు బదులు ఎవరి చేతిలో సాధారణ ప్రజానికపు ప్రాణాలు పోవుచున్నవో, ఎవరి వలన దేశ ప్రతిష్ట దెబ్బతింటున్నదో, ఎవరి వలన ఆ దేశము రెండు చేతులా దోచుకో బడుచున్నదో ఆ ఉగవాదులను పట్టుకునే శక్తినిచ్చు గాకా!. పాకిస్తాన్ అహ్మదీయులను సురక్షితముగా కాపాడమని, ఆ దృష్టుల దుశ్చర్యల నుండి అహ్మదీయులను కాపాడమని అహ్మదీయులు పదే పదే దుఆలు చేస్తుండాలి. త్యాగముల విషయమునకు వచ్చినచో అహ్మదీయులు వాటిని సమర్పించు చుందురు. అల్లాహ్ తాలా ఈ త్యాగములకు త్వరగా ఫలములందించును. ఇన్ షా అల్లాహ్.

అల్‌జీరియాలో కూడ ప్రభుత్వము అహ్మదీయులను చాలా హింసించుచున్నది. అల్లాహ్ తాలా వారిని కూడ రక్షించుగాక! వారికి కూడ స్థిరత్వము ప్రసాదించుగాక!. శాంతి వంతులు, చట్టమును పాటించువారైన అహ్మదీయుల వాస్తవికతను అర్థము చేసుకొనుటకు అక్కడి ప్రభుత్వమునకు బుద్ది నొసంగు గాక!. అహ్మదీయులు ప్రభుత్వమునకు విరుద్ధముగా కుట్రలు పన్నుచున్నారని లేదా పీడనము సృష్టించ దలచినారని ఆరోపించ బడుతున్నారు. యదార్థమేమనగా ప్రపంచములో ఎక్కడ కూడ అహ్మదీయులు దేశ చట్టమును ఉల్లఘించరు. ప్రభుత్వముతో జగడమాడరు. మేము శాంతి, అనురాగము, ఆప్యాయతలను పంచే వారము. ఇందుకు త్యాగములు సమర్పించవలసి వచ్చినను సమర్పింతురు. ఇన్ షా అల్లాహ్.

నేను మరల హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) తెల్పిన అంశాల వైపు వచ్చెదను. వారిట్లు తెల్పిరి: ప్రపంచములో అందరికన్న అధికమైన వ్యతిరేకతను ధనికులు ప్రదర్శించుదురు. పంజాబ్‌లో ప్రఖ్యాతి గాంచిన జాతీయ వాక్యము " షరాకత్ దాదాన సర్ దుక్‌దేవి ఖానా" గలదు. అనగా అందరి కన్న వ్యతిరేకత ధనికులు, ఉన్నత వంశస్థులు ప్రదర్శించెదరు. ఎందుకనగా వారిలో నుండే ఒక వ్యక్తి నిలబడి ప్రపంచములో గౌరవం, కీర్తి ప్రతిష్టలను పొందడం ను వారు తట్టుకోలేరు. అలా గౌరవం పొందేవారికి వ్యతిరేకముగా భూమండలంలోని అణువణువుతో పోరాడుటకు వారు సిద్ధముగా ఉందురు. అలాంటి వారికి ప్రపంచస్థాయి గౌరవం లభిస్తుండగా వారు ఎలా సహించగలరు?. అందుకే అలాంటి వారిని పూర్తిగా నామ రూపాలు లేకుండా చేయుటకు తమ శక్తి సామార్థ్యములను అన్నింటిని ఖర్చు చేయుదురు. అయినా కూడ వారు సఫలీకృతులు కాకుండా నిస్సహాయులైనచో వారు చివరికి వారి హృదయ వేదనను బహిర్గతం చేయుదురు. మరల వారు ఇట్లు తెల్పిరి: హజ్రత్ హకీం నూరోద్దిన్ (ర) ప్రథమ ఖలీఫా గారు ఒకసారి ఒక సంఘటణను గూర్చి తెల్పిరి: షాపూర్ భూస్వాములలో ఒక భూస్వామికి ఖాన్ బహదూర్ అనే బిరుదు దక్కినది. ఆ వంశమునకు చెందిన ఒక పేద మహిళ తన కుమారునికి ఖాన్ బహదుర్ అని నామకరణం చేసినది. నీవు ఆ పేరును ఎందుకు పెట్టావని ఆ పేద మహిళను కొందరు ప్రశ్నించగా, నా కుమారుడు పెద్ద వాడైన తరువాత ఏమి అవునో నాకు తెలియదు, కావున ఈ పేరు పెట్టినచో అతనిలా గౌరవంగా పిలిచినట్లుగా కాకుండా చివరికి నా కుమారుడిని ఆ గౌరవ ప్రదమైన నామముతో పిలుచుకొందురు, అది విని నాకు ఆనందము కల్గునని ఆ మహిళ సమాధానం ఇచ్చినది. కావున కొందరు ఏమి చేయలేక చివరికి అలా పేర్లను పెట్టుకొని వారి హృదయ వేదనను తీర్చుకొందురు.
మరల వారు(ర) ఇట్లు తెల్పిరి: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వాగ్దానము చేసిన సమయంలో వారి వంశంలో కూడ ఒకరు ఇమాంగా వాగ్దానం చేసినారు. సన్నిహితుల చేష్టలు ఇవి. వారి (అ) బంధువులు నీవు వాగ్దానము చేసినావు. ప్రజల శ్రద్ధంతయు నీవైపే యున్నది. కావున వారి శ్రద్ధను నా వైపునకు మరల్చుకొనుటకు నేను కూడ వాగ్దానము చేసానని వారి (అ) తో తెల్పిరి. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) ఒక ఫార్షి ఉదాహరణను తెల్పుచు ఇట్లనిరి: "ఫికర్ హర్ కస్ బఖదర్ హిమ్మత్ ఓస్త్" అనగా ప్రతి ఒక్కరి ఆలోచన, అవగాహన వారి వారి ధైర్యాన్ని బట్టి ఉంటుంది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నేను కేవలం చిన్న చిన్న జాతుల వారి కోసమే కాకుండా ప్రపంచమంతటికి న్యాయనిర్ణేతగా అవతరించబడినాను అని, పెద్ద పెద్ద చక్రవర్తులు కూడ నన్ను తప్పకుండా అనుసరించాలని ప్రకటణ చేసిరి. కాని వారికి పోటీగా ప్రకటణ చేయువారు మాత్రం కేవలం పేరు పెట్టుకున్నట్లుగానే వారి (అ) వంశంనకు చెందిన వాడే అయినను కేవలం చిల్లర జాతుల వారి కోసమేనని ప్రకటణ చేసుకొనెను. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వాగ్దానము చేసిన తరువాత ఇంగ్లాండ్‌కు చెందిన చక్రవర్తులు కూడ నన్ను స్వీకరించవలెను అని వారికి లేఖ కూడ వ్రాసి ఆ కాలంలో పరిపాలన చేస్తున్న రాణి గారికి పంపించడమైనది. ఇది ఒక సత్య వాగ్దాత ధైర్యం. అందుకు భిన్నముగా చిల్లర జాతుల వారికి ఇమాంగా వాగ్దానం చేసిన ఆ అవతారుని ధైర్యము కూడ చూడండి. ఒక పోలీస్ అధికారి వచ్చి నీవు ఏదో ప్రకటణ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. నీవు ఏ ప్రకటణ చేసావని ప్రశ్నించగా, ఆ చిల్లర జాతుల ఇమాం నేను ఏ ప్రకటణ చేయలేదు, ఎవరో మీకు తప్పడు సమాచారం అందించి ఉంటారని సమాధానం ఇచ్చెను. కావున ఆకతాయిల వ్యతిరేకత అధికముగా ఉంటుంది.

(ఖుత్బాతే మహమూద్ సంపుటి 3, పుట 38- 39)

బంధువులు వ్యతిరేకించడం ప్రారంభించినచో వారి తిరస్కరణ చాలా కఠినముగా ఉంటుంది. ఎదుటి వారిని ఓడించడం కోసం వారు సక్రమమైన, అక్రమమైన మార్గాలను ఎంచుకుంటారు. ఈ విషయమును తెల్పిన తరువాత వారు (ర) మరల ఇట్లు తెల్పిరి: అహ్మదియ్యత్ వలన మా వంశంనకు చెందిన బంధువులెందరో మాకు దూరమైనారు. మేము వారితో కలవకపోవడం వలన కాదు, వారే మాతో కలియుటకు ఇష్టపడేవారు కాదు. మా బంధువుల నుండి మాకు తిట్లు లభించేవి. తరువాత కాలంలో అహ్మదియ్యత్‌ను స్వీకరించిన మా పెద్దమ్మ కూడ మమ్ము దూషించే వారు. నేను 6, 7 సంవత్సారల వయస్సులో ఉన్నప్పడు నేను మెట్ల ద్వార ఇంటిపై కప్పకు వస్తుండగా, నన్ను చూసి మా పెద్దమ్మ పదే పదే " జిహూం జియాకాం ఓహూం జీ కోకో" ఈ పదమును పదే పదే అనడం వలన ఈ పదము నాకు గుర్తుండిపోయినది. నేను ఇంట్లోకి వెళ్లిన తరువాత ఈ పదము యొక్క అర్థం అడగి తెలుసుకోగా నీ తండ్రి ఎలా చెడ్డవాడో, నీవు కూడ అలాగే చెడ్డవాడివని తెలిసింది. ఖాదియాన్‌లో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను బహిష్కరించిరి. వారి ఇంటి పనులు చేయుటకు వచ్చే పని వారిని కూడ రాకుండా చేసారు. కుమ్మరి వారిని, ఇల్లు, ముంగిలి శుభ్రము చేయువారినీ అడ్డుకొనిరి. మా సోదరుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అన్న గారి భార్య, ఇతర బంధువులు, స్వయముగా మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మేన మామా గారి కుమారుడు షేర్ అలి మొ॥ వారు రక రకాల ఇబ్బందులకు గురి చేసేవారు. ఒకసారి గుజరాత్ నుండి 7 గురు సోదరులు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను కలుసుకొనుటకు ఖాదియాన్ వచ్చిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తోటను చూచుటకు తోట వద్దకు వెళ్లిరి, మార్గములో మా బంధువు ఒకరు తోట నాటుచుండిరి. ఆ బంధువు ఆ అతిథులను పలకరిస్తూ మీరు ఎక్కడి నుండి వచ్చారు?. ఎందుకు వచ్చారని ప్రశ్నించిరి. అందుకు ఆ అతిథులు మేము గుజరాత్ నుండి వచ్చాము, మిర్జా గారిని కలవడం కోసం వచ్చామని సమాధానం ఇచ్చిరి. అందుకు మా అ బంధువు చూడండి, నేను మిర్జా గారి స్వయాన మేన మామ కుమారుడను, మీ అందరి కన్న ఎక్కువ మిర్జా గారి గురించి నాకు తెలుసు, మిర్జా సాహెబ్ అలాంటి వాడు, ఇలాంటి వాడని తెలుపు చుండగానే అతనికి సమీపంలో ఉన్న ఒక అతిథుడు అతనిని పట్టుకొని, దూరంలో ఉన్న తన సోదరులను త్వరగా రండని పిలువ సాగెను. ఈ దృశ్యమును చూసిన ఆ బంధువు భయభ్రాంతులకు గురి అయ్యెను. అతని భయాన్ని చూసి ఆ అహ్మదియ్య అతిథి మేము నిన్ను ఏమి చేయము. ఎందుకనగా మీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి బంధువులు, నేను కేవలం మా సోదరులకు నీ రూపాన్ని చూప దలచుకున్నాను. ఎందుకనగా షైతాన్ కనబడదని అందరు అంటూ ఉంటారు. కాని నేడు మేము ఆ షైతాన్‌ను చూసామని, అది నీ రూపంలో ఉన్నదని వదిలి వేసిరి.

(అల్ ఫజల్ సంపుటి 23, సంచిక 132, పుట 3,4. తేది డిసంబర్ 4, 1935)

నీవు తప్ప ఈ వంశస్థుల సంతానములు అంతమగునని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నకు చెప్పబడెను. వ్యతిరేకతలు ఎదురైనవి. అన్ని జరిగినవి. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నకు అల్లాహ్ తాలా భరోసా ఇచ్చుచూ ఇట్లనెను. ఈ వంశ సంతానము నీతోనే కొనసాగును. ఇతరులందరు నామరూపాల్లేకుండా పోవుదురు. ఇలాగే జరిగినది. ఈ జమాఅత్‌లో చేరినవారు మాత్రమే నేటికి ఈ వంశములో మిగిలి యున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ప్రకటన చేసినప్పడు వంశములో సుమారు 70 మంది పురుషులుండిరి. కాని ఇప్పడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) శారీరక, ఆధ్యాత్మిక సంతానము తప్ప ఆ 70 మందిలో ఒక్కరికి సంతానము కూడ మిగలలేదు. తమతో సాధ్యమైనంత వరకు వారు హజ్రత్ గారి నామమును అంత మొందించుటకు ప్రయత్నించారు. పూర్తిగా తమ వంతు కృషి చేసినారు. ఫలితమేమైనది. వారు స్వయముగా అంతమైనారు. వారి సంతానములు అంతమైనవి. ఇది కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సత్యమునకు ఒక గొప్ప సంకేతము.

(ఖుత్బాతే మహమూద్ సంపుటి 3, పుట 39)

మరల పెద్దమ్మ బైఅత్ సంఘటనను ప్రస్తావించుచూ హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) ఇట్లు తెలిపిరి. కొన్ని భవిష్యవాణీలు, సంకేతములు బాహ్యములో చిన్నవిగా యుండును. కాని వాటి స్థితిని గమనించు వారికి వాటిలో చాలా విషయమును తెలియును. వాటితో విశ్వాసము పెరుగును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నకు ఒక భవిష్యవాణి అవతరించినది. కాని ఆ భవిష్యవాణిని గూర్చి నాకు నిన్ననే తెలిసినది. ఆ భవిష్యవాణి వ్యక్తి గతమైనదే అయినను, దానిని పరిశీలించినచో అందులో ఎన్నో భవిష్యవాణులు కలవని అర్థమవును. ఈ భవిష్యవాణి అనేకులకు ముందు నుండే తెలుసు, కాని నాకు మాత్రం నిన్ననే తాయి గారి మరణం తరువాత షేక్ యాకూబ్ అలి ఇర్ఫాన్ గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) పై "తాయి ఆయి" అనే ఒక భవిష్యవాణి అవతరించినదని తెలిపిరి. అనగా పెద్దమ్మ వచ్చిరి. ఈ పెద్దమ్మ హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (ర.అ) పెద్దమ్మ. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి పెద్దన్న భార్య. గతంలో అహ్మదీయులకు "తాయి ఆయి " అనే గత భవిష్యవాణి యొక్క అర్థం ఎవరికి సరిగా తెలియనందున రకరకాలుగా ఆ భవిష్యవాణికి అర్థాలుచెప్పుకునేవారు. కొందరు ఒక అర్థాన్ని తెలుపగా, మరొకరు మరో అర్థమును తెలుపేవారు, కాని దాని సహజమైన అర్థం బంధుత్వంలో పెద్దమ్మగా పిలువబడు ఒక మహిళ వచ్చును. వచ్చును అనే భావంలో రెండు అర్థాలు గలవు. ఒకటి సాన్నిహిత్యంతో వచ్చుట, రెండవది జమాఅత్‌ను స్వీకరించుట. సాధారణముగా రావడంలో విశేషం ఏమి ఉండదు. సహజంగా బంధువులు వస్తూ, పోతూ ఉంటారు. మా ప్రాంతములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి వదిన గారిని అందరు తాయి అని పిలుచేవారు. ఈ విధముగా వారి నామమే తాయిగా స్థిరపడింది. కాని ముహమ్మదీ భేగం భవిష్యవాణి సమయంలో వారు ఎంతో బలంగా వ్యతిరేకతను ప్రదర్శించిన విషయం జమాఅత్ పుస్తకాలను చదువే వారికి తెలిసే ఉంటుంది. అనగా ఈ తాయి చాలా భయంకరముగా వ్యతిరేకించేది. ఎందుకనగా వారు ఆ వంశములోనే పెద్ద కోడలు, మరియు భవిష్యవాణి కూడ వారి సోదరి కుమార్తెను గూర్చి అవతరించినది. అందువలనే ఇటు వంశంలో పెద్ద కోడలు అయినందున, భవిష్యవాణి ప్రకారం జరిగినచో వంశ ప్రతిష్టకు భంగం కల్గునని భావించినందున వారు ఆ సంబంధములను అడ్డుకొనుటలో కీలక పాత్రను పోషించిరి. ఈ విషయంలో ఎదురించుటను తన భాధ్యత గా భావించిరి. హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర) మరల ఇట్లు తెల్పిరి: మహిళల స్వభావంలో, అది కూడ వారు ఇంటికి పెద్ద వారైనచో అన్ని ధార్మిక, ప్రాపంచిక మరియు ఇతర అంశాల కన్న తమ వంశ పరువు ప్రతిష్ఠలనే అత్యంత గౌరవముగా భావిస్తారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆ కాలంలో మసీహ్ గా వాగ్దానం చేసినను ఈ విషయం వారికి అనగా తాయి గారికి తమ వంశ పరువు ప్రతిష్ఠల కన్న విలువైన అంశంగా భావించే వారు కాదు. అంతేగాకా పెద్ద వారు చిన్న వారిని అనుసరించాలనే విషయంను జీర్ణించుకోలేరు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తాయి గారికన్న వయస్సులో చిన్నవారు, అంతేగాకా వారి వారసత్వంగా వచ్చిన ఆస్థిలో నుండి భాగము కూడ తీసుకోలేదు, అందువలన వారి భోజన ఏర్పాట్లన్నియు తాయి గారి గృహము నుండే జరుగేవి. కావున ఈ కారణంగా కూడ తాయి గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) పై ఉపకారం చేస్తున్నానని భావించేవారు. మహిళలో ఈ స్వభావం సహజ సిద్ధముగా ఉంటుంది. అందువలనే వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను తమ ఆధినంలో ఉన్నవారిగా భావించేవారు. మసీహ్ మౌవూద్ (అ) ఆస్థిని తీసుకోలేదు. ఆస్థి అంతయు తన వద్దనే యున్నదని భావించుకోకుండా, నేను భోజనం పంపిస్తున్నాను, నేనే వారి ఖర్చును భరిస్తున్నాను. కావున నేను వారి(అ)పై ఉపకారం చేస్తున్నాను, వారు నా ఆధినములో ఉన్నారని భావించసాగిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ ఒక అరబి పద్యములో ఇలా తెల్పిరి:

**"లుఫా జాతిల్ మవాఇదూ కాన ఉక్లీ**
**వ సిర్తూల్ యౌమా ముతాహిముల్ అహాలి"**

ఆ పద్యము అర్థమేమనగా: ఒక కాలంలో నేను ఇతరుల ముక్కలపైన జీవితం గడిపే వాడిని, కాని నేడు అల్లాహ్ తాలా నాకు ఎంతటి స్థాయిని కల్పించినాడనగా కొన్ని వేల కుటుంబములు నా ధాన్యగారము ద్వార జీవనం కొనసాగిస్తున్నాయి. హజ్రత్ అఖ్దస్ గారి ఆస్తి వేరుగా లేదని, వారి పెద్ద అన్నయ్య ఆధినములోనే యున్నదని, వారిలో ఆస్తిని ఆధీనములో పెట్టుకోవాలనే కోరికయే లేదని, అందుకు వారి (అ) తండ్రి గారు కూడ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆస్తిని కాపడుకోలేరని సమ్మతి తెల్పినట్లు ఈ పద్యములో ఆ సంఘటనలను గూర్చి కూడ తెలుపడమైనది. కావున ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకున్నచో తాయి గారు విశ్వసిస్తారని ఎవరు ఊహించలేరు. కాని వారు తరువాత కాలంలో విశ్వాసం తీసుకవచ్చి జమాఅత్‌లో చేరినది. హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర) ఇట్లు తెల్పిరి: ఆధారాలు, ధార్మిక అంశాలు గాకుండా కుటుంబ వ్యవహారాల దృష్ట్యా వారి సోదరి కుమార్తె వివాహం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో జరుగుటకు ఏ మాత్రం సమ్మతించలేక పోయిరి. ఎందుకనగా వారి దృష్టిలో ఇరువురి అనుబంధము ఒక యజమానురాలు మరియు ఒక సేవకుని వలె ఉన్నట్లు భావించుకొను చుండిరి. అనగా తాయి గారు తనను తాను యజమానురాలుగా, నవూజ్ బిల్లాహ్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ఒక సేవకుడని భావించు చుండిరి. అంతేగాకా మసీహ్ మౌవూద్ (అ)ను ఒక పేద వానిగా భావించేవారు. ఏ పని చేయకుండా కేవలం వారి రొట్టె ముక్కలపై జీవనం గడుపుచున్న వారిగా భావించు చుండిరి. అందుకు తాయి గారు అంగీకరించలేక పోయిరి. ఆ కాలంలో మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను చాలా తీవ్రంగా వ్యతిరేకించేవారు, బందువులందరు వారి (అ) ని కలవటం వదిలి వేసారు. తాయి గారు కూడ వారి (అ) ని కలుసే వారు కాదు. కుటుంబికుల వ్యతిరేకతను గూర్చి తల్లి (ర) గారు (హజ్రత్ అమ్మజాన్ గారు) ఈ విధముగా తెల్పినారు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అమమ్మ గారి కుటుంబములో ఒక పెద్ద వయస్కురాలు ఉండే వారు, చిరాఘ్ బీ, బీ గారి కుమారుడిని ఎవరు చూడనీయడం లేదని అంటుండే వారు. మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ఒక దొంగను, ఒక బందిపోటును వేరుగా ఉంచినట్లుగా వేరుగా ఉంచేవారు. ఎందుకనగా వారి వలన తమ కుటుంబానికి చెరుగని మచ్చ వచ్చినదని అందరు భావించ సాగిరి. అలాంటి పరిస్థితిలో తాయి గారు జమాఅత్‌ను స్వీకరిస్తారని తెలుపడం ప్రకృతికి విరుద్ధమైన చర్యగా కనిపించు చుండెను. మానవుని హృదయం మారుతుంది. కాని పరిస్థితులు ఏ విధముగా ఉన్నాయో వాటిని కూడ గమనించవలెను. అలాంటి పరిస్తితిలో వారికి " తాయి వచ్చినదని " సువార్త అందడం జరుగుతుంది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కు తాయి వచ్చినది అనే సువార్త వాణి అందినది, కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి వదిన అవుతుంది. కావున ఈ పదాల దృష్ట్యా తెలియునది ఏమనగా, తాయి గారు ఎప్పడు బైఅత్ చేస్తారనగా, బైఅత్ తీసుకొను వారితో తాయి గారి సంబంధము తాయి అయి ఉండాలి. ఒకవేళ వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి బైఅత్ చేయవలసి వచ్చినచో "వదిన వచ్చినది" (బావజ్ ఆయి) అనే సువార్త వాణి అవతరించాలి. అనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి వారు వదిన అవుతుంది కావున "వదిన వచ్చినది" అనే సువార్తవాణి అందాలి. ఒకవేళ హజ్రత్ హకీం నూరొద్దిన్ ప్రథమ ఖలీఫా (ర)గారి కాలంలో బైఅత్ చేయవలసి వచ్చినచో "మసీహ్ మౌవూద్ వంశంనకు చెందిన ఒక మహిళ వచ్చినది" అనే సువార్త వాణి అందాలి. కాని ఇక్కడ తాయి అనే పదం బహిర్గతము చేయు విషయము ఏమిటనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి ఒక కుమారుడు ఖలీఫాగా ఎన్నుకోబడును. వారి హస్తముల పైనే బైఅత్ చేయును. ఒకవేళ వారి సంతానం నుండి ఎవరు కూడ ఖలీఫాగా ఎన్నుకోబడరని తెలిసినచో తాయి అనే పదం వ్యర్థమైనట్లే కదా!. మరల వారు (ర) ఇట్లు తెల్పిరి: ఈ భవిష్యవాణిలో మూడు సందేశములు గలవు. ఒకటి హజ్రత్ మసీహ్


## హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్యమునకు ఒక గొప్ప నిదర్శనము

وَلَوْ تَقَوَّلَ عَلَيْنَا بَعْضَ الْأَقَاوِيلِ. لَأَخَذْنَا مِنْهُ بِالْيَمِينِ. ثُمَّ لَقَطَعْنَا مِنْهُ الْوَتِينَ.

(అల్‌హాఖ్ఖా: 45-47) అనగా కొన్ని విషయములను అతడు (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం) మా వైపు అంటగట్టి యుండినచో మేమతినిని తప్పక కుడి చేతితో బంధించువారము. తరువాత నిశ్చయముగా మేము అతని మెడనరమును కోసివేయువారము.

అహ్మదియ్య జమాఅత్ వ్యవస్థాపకులైన హ॥జ్రత్ అఖ్దస్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌవూద్ మహ్ది మాహూద్ అలైహిస్సలాం ఇస్లాం సత్యము, ఆం॥హ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో తన ఆధ్యాత్మిక బంధము గురించి అనేక సార్లు అల్లాహ్ తఆలా ప్రమాణము చేయుచు నేను అల్లాహ్ తఆలా తరపున అవతరించితినని చెప్పినారు. ఇటువంటి ఎన్నో ఉపదేశములను సమకూర్చి ఒక పుస్తకము

**"అల్లాహ్ ప్రమాణము"**

పేరిట ప్రచురించబడినది. ఈ పుస్తకమును పొందుటకు ఔత్సాహికులు క్రింది చిరునామా/ఇ మెయిల్ ద్వారా సంప్రదించి ఉచితముగా పొందగలరు.

email: javidashu123@gmail.com
Mobile:98663 58609,75693 58609
Postal Address: Muhammad Javed Ahmad
H.No. 3-4-772, Opp: C.C.Shroff Hospital
BARKATPURA, KACHIGUDA, 500 027
HYDERABAD, TELANGANA.

మౌవూద్ అలైహిస్సలాం గారి సంతానంలో నుండే ఒకరు ఖలీఫాగా ఎన్నుకోబడుదురు. రెండవది, ఆ సమయంలో తాయి గారు జమాఅత్‌లో చేరుదరు. మూడవది ఏమిటనగా, తాయి గారి వయస్సును గూర్చి కూడ ఇందులో సందేశం కలదు. అది ఏ విధముగా అనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి వయస్సు ఆ సమయం వరకే 70సంవత్సారాల వరకు ఉండెను. అయిన కూడ వారు (అ) వారి కన్న వయస్సులో పెద్దవారైన ఒక మహిళను గూర్చి వారు చాలా కాలం వరకు జీవించే ఉంటారని భవిష్యవాణి చేయుచున్నారు. అంతేగాకా వారి సంతానం నుండే ఒకరు ఖలీఫా గా ఎన్నుకోబడుదురు. ఆ ఖలీఫా సమయంలో వారు బైఅత్ చేయుదురు. ఇంత పెద్ద వయస్సు లభించడం చాలా గొప్ప విషయం. మానవుని మేధస్సు ఒక నవయువకున్ని గూర్చి కూడ అతడు ఇన్ని సంవత్సారాల వరకు జీవించి యుండును అని ఖచ్చితముగా చెప్పలేదు. ఈ తాయి గారు బహుశా 1927వ సంవత్సరములో పరమపదించిరి. అనగా ఒక వృద్ధురాలిని గూర్చి భవిష్యవాణి చేయడమైనదని అర్థం. మొత్తానికి ఇదొక చాలా అద్భుతమైన భవిష్యవాణి. తాయి గారు బైఅత్ చేయడం, అది కూడ నా కాలంలో చేయడం. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహివస్సలాం గారి కుమారులలో ఒకరు ఖలీఫాగా ఎన్నుకోబడడం ఎన్నో సందేశాలను కేవలం రెండు పదాలలోనే పేర్కొనడం జరిగినది.

మరల వారు (ర) ఇట్లు తెల్పిరి: తాయి గారు కేవలం జమాఅత్‌లో చేరడమే గాకుండా వారు వస్సియ్యత్ కూడ చేసిరి. ఈ విషయానికి కూడ ఒక చరిత్ర గలదు. పూర్వపు కుటుంబాలలో ఉన్న ఆచారాలు, సాంప్రదాయాలను చూసినచో తాయి గారు అహ్మదియ్యత్‌ను స్వీకరించడమే గాకుండా, వసియ్యత్ చేయడం కూడ ఒక పెద్ద అద్భుతముగా ఉన్నదని నాకు అనుపిస్తుంది. ముందుగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను వారి పూర్వికుల సమాధి చేయు స్థలంలో కాకుండా మరొక చోట సమాధి చేయుటకు తాయి గారు ఇష్టపడేవారు కాదు. ఆ సమయంలో వారి(అ) వారి పూర్వికులను సమాధి చేసిన స్థలంలో గాకుండా మరెక్కడ సమాధి చేయకూడదని కూడ కబురు పంపిరి. ఎందుకనగా అలా చేసినచో ఇది అవమానంగా భావించబడును. తరువాత కూడ చాలా కాలం వరకు తాయి గారు ఈ విషయంపై ఆరోపణలు చేసినారు. కాని తరువాత వారే స్వయముగా వసియ్యత్ చేసి, బెహస్తీ మఖ్బర లో సమాధి చేయబడిరి. ఒక వివేకవంతునికి ఇదొక పెద్ద నిదర్శనం. చూడడానికి ఇది చాలా సాధారణ విషయం. ఇది కేవలం ఒక వ్యక్తిని గూర్చే గలదు. కాని ఇందులో సత్య నిదర్శనమునకు చెందిన అంశాలు ఎన్నో గలవు. ( ఖుత్బాతే మహమూద్ సంపుటి 11, పుట 251-253) వ్యతిరేకత ఉన్నా కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను తమ పూర్వికులను సమాధి చేసిన స్థలంలోనే సమాధి చేయాలని కోరిన ఒక వ్యక్తి, తరువాత కాలంలో స్వయముగా వసియ్యత్ చేసి వారు కూడ బెహస్తి మఖ్బరలో సమాధి చేయబడినారు.

మరల హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దిల్లి పర్యటణను గూర్చి వివరిస్తూ హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) ఒక చోట ఇట్లు తెల్పిరి: దేవునిపై విశ్వాసం ఉన్న ఏ వ్యక్తి కూడ ఏనాడు దైవ కార్యమును గూర్చి నిష్ప్రయోజన మవునని ఆలోచించడు. అల్లాహ్ తాలా వారి ప్రయత్నాలకు ఎంతో అరుదైన ప్రతిఫలంను ఇస్తాడనే ఒక గట్టి నమ్మకం ఉంటుంది. వారు ఇట్లు తెల్పిరి: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దిల్లిని పర్యటించినప్పుడు నేను బాల్యములో ఉన్నాను. దిల్లిలో వారు (అ) జమాఅత్ సభ్యులను ఉద్దేశించుతూ ప్రసంగించు చుండిరి. వారు (అ) దిల్లిలో గల దైవజనుల సమాదుల వద్దకు చేరుకొని చాలా సమయం వరకు దుఆ చేసిరి. ఈ కాలంలో ప్రజల సంస్కరణ కోసం అవతరింపజేసిన అవతారున్ని ఆ దైవజనుల సంతానం గుర్తించుటలో నిర్లక్ష్యం చూపకూడదని భావించి వారి ఆత్మలు ఉత్తేజభరితమై వారి సంతానంలో ప్రోత్సాహాన్ని నింపాలని నేను దుఆ చేసానని, అంతే గాకుండా అల్లాహ్ తాలా తప్పక ఒక రోజు వీరి సంతానం యొక్క హృదయములను తెరుచును. వారు తప్పక సత్యాన్ని స్వీకరించెదరని కూడ వారు (అ) తెల్పిరి. ఆ సమయంలో నేను బాల్యంలో ఉన్నా కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి వాక్కులు నా హృదయంపై ఎంతో ప్రభావాన్ని చూపాయి. కావున ఇక్కడి జమాఅత్ సభ్యులు తమ ప్రయత్నాల ప్రతిఫలములను చూడదలచినచో వారు అల్లాహ్ తాలాపై పూర్తి నమ్మకాన్ని పెంచుకోవాలి. నిశ్చయముగా ఒక రోజు అల్లాహ్ తాలా స్థాపించాలనుకున్న దానిని తప్పక స్థాపించి చూపును. వారు (అ) దిల్లి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో ఈ విషయంను తెల్పిరి.

(అన్వారుల్ ఉలూమ్ సంపుటి 12, పుట 83-84)

కావున నేడు కూడ దిల్లి జమాఅత్ సభ్యులు వివేకంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సందేశమును అందించుటకు ప్రణాళికలు రూపొందించు కోవాలి. దేవుని దయ వలన పుస్తక ప్రదర్శనశాలల ద్వార సందేశం చేరవేయు అంశంలో చాలా వరకు ముందున్నారు. కాని ఇతర ముస్లింల నుండి వ్యతిరేకత కూడ వచ్చును. కావున వారికి కూడ తప్పని సరిగా ఈ సందేశాన్ని అందజేయాలి. వీటన్నింటికన్న ముఖ్యమైనది దుఆ, కావున దుఆ వైపు అందరు చాలా శ్రద్ధ చూపాలి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సత్య స్వప్నంలో ఇట్లు చూసిరి. ఒక కాలువ చాలా పొడువుగా త్రవ్వబడి యున్నది. దానిపై గొర్రెలు పడుకోబెట్టబడినవి. ప్రతి గొర్రె తల వద్ద ఒక్కొక్క కసాయి కత్తి పట్టుకొని ఆకాశం వైపు చూస్తూ ఒక ఆదేశం కొరకు నిరీక్షించుచుండెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అప్పడు నేను నడుస్తూ వారి సమీపంనకు వెళ్లి “**ఖుల్ మా యా బావుబికుం రబ్బి లౌలా దుఆవుకుం**” ( అల్ ఫర్ఖాన్ 78) అని చదివాను. వారు వెంటనే కత్తితో గొర్రెల గొంతులు కోసిరి. ఆ గొర్రెలు విలవిల్లాడు చుండగా ఆ కసాయిలు ఇట్లనిరి. మీ స్థాయి ఎంత?. మలినం తినే గొర్రెలే కదా!. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) ఇట్లు తెల్పిరి. ఆ రోజులలో 70 వేల మంది ప్లేగు వ్యాధితో మరణించిరి. ఎవరైన శ్రద్ధ వహించనిచో అల్లాహ్ తాలా అతనిని లెక్క చేయడు. దైవ కార్యములు ఆగవు. అవి జరిగి తీరును. హజ్రత్ మసీహ్ నాసిరి అనంతరం మూడు వందల సంవత్సరముల తరువాత క్రైస్తవ ధర్మము ప్రగతి చెందెను. కాని మన పరిస్థితులను చూసినచో హజ్రత్ మసీహ్ నాసిరి కన్న చాలా ముందే అహ్మదియ్యత్ ప్రగతి చెందునని తెలుస్తున్నది. ఇన్షా అల్లాహ్. పాకిస్తాను మౌల్వీలు లేదా ఏ ధార్మిక నాయకుడు లేదా ప్రాపంచిక శక్తులకు అల్లాహ్ తాలా వద్ద ఎలాంటి స్థాయి లేదు. వారు గొర్రెలను పోలి యున్నారు.

వీరు ఎన్నడు అహ్మదియ్యత్ ప్రగతిని అడ్డుకోలేరు. కాని ఇందుకు మన ముభల్లిఘ్‌లు, మౌల్వీలు ప్రచారం చేసి అహ్మదియ్యత్‌ను వ్యాపింపజేయాలని మనము వారిపైన మాత్రమే ఆధారపడి యుండలేము. మనము ఈ ప్రగతిలో భాగం కాదల్చినచో దుఆల వైపు శ్రద్ధ వహించవలెను, తమ ఆధ్యాత్మికతను పెంచుకోవలెను, దైవంతో అనుబంధమును పెంచుకోవలెను. ఈ విషయాలే అహ్మదియ్యత్ ఎదుర్కొంటున్న వ్యతిరేకతను ముగించును. అహ్మదియ్య జమాఅత్ ప్రగతిలో కూడ మనలను భాగస్వాములుగా చేయును. అల్లాహ్ తాలా మనకు ఈ స్థాయి ప్రసాదించు గాకా! (ఆమీన్).

జుమా నమాజ్ తరువాత నేను గౌ॥ సూఫ్ని జఫర్ అహ్మద్ ముభల్లిఘ్ ఇండోనేషియా గారి పరోక్ష జనాజ నమాజ్‌ను చదువించెదను. వీరు నవంబర్ 8, 2016న హృదయ స్ఫందన ఆగిపోవడం వలన పరమపదించిరి. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. వారు వయస్సు 71 సంవత్సరాలు, ఆగష్టు 18, 1945లో పడాంగ్ సుమత్రా లో వారు జన్మించిరి. వీరి తండ్రి జైని దలాను గారు 1923 సంవత్సరములో రెండవ ఖలీఫా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) గారి హస్తములపై బైఅత్ చేసి అహ్మదియ్య జమాఅత్‌ను స్వీకరించిరి. ఆ తరువాత వారు మరో ఇద్దరు యువకుల సహాయంతో సుమత్రా మరియు జావా దీవులలో జమాఅత్ ప్రచార కేంద్రాలను ఏర్పాటు చేసిరి. అదే విధముగా సూఫ్ని జఫర్ గారి తండ్రి ఇండోనేషియాలో పినీర్ ముభల్లిఘీన్‌లో చేరిరి. జైని దాలన్ గారి ముగ్గురు కుమారులు గలరు. అందులో ఒకరైన సూఫ్ని జఫర్ గారిని జీవిత సమర్పితులను చేసి, ధార్మిక విద్యాభ్యాసం కోసం జామియా అహ్మదియ్య రభ్వాకు పంపిరి. జులై 17, 1963లో సూఫ్ని జఫర్ గారు రబ్వాకు ప్రయాణించిరి. సుమారు 11 సంవత్సరాల పాటు వారు జామిఆ అహ్మదియ్యలో విద్యనభ్యసించి1974వ సంవత్సరములో ఇండోనేషియా తిరిగి వెళ్లిరి. అక్కడ వారికి మొదటి పోస్టింగ్ క్లింతాన్‌లో ఇచ్చిరి. ఆ తరువాత పశ్చిమ జావాలో రీజనల్ ముభల్లిఘీన్ మరియు రీజనల్ అమీర్‌గా సేవలందించిరి. ఆ తరువాత వారు ఈస్ట్ జావా మరియు పపువాలో కూడ సేవలందించిరి. 1985 నుండి 1987 వరకు జంభిలో, 1987 నుండి 1991 వరకు ఉత్తర సుమత్రాలో రీజనల్ ముభల్లిఘ్‌గా కూడ సేవలందించిరి. 1991 నుండి 1997 వరకు జామియా అహ్మదియ్య ఇండోనేషియాలో ఫిఖ్ఆ ఉపాధ్యాయులుగా బోధించే భాగ్యమునను పొందిరి. ఆ కాలంలోనే నూతన అహ్మదియ్యుల శిక్షణ శాఖకు ఇంచార్జ్‌గా కూడ సేవలందించిరి. 1997 నుండి 2001 వరకు లాంపోంగ్‌లో రీజనల్ ముభల్లిఘ్‌గా కూడ నియమితులైరి. వారి కృషి వలన ఇండోనేషియాలో ఎన్నో జమాఅత్‌లు ఏర్పడినవి. కొన్ని మస్జిద్‌లు, మిషన్ హౌజ్‌ల నిర్మాణం కూడ చేపట్టిరి. ఇండోనేషియా భాషలో నాలుగు పుస్తకాలను రచించిరి. జకాత్ వాస్తవికత, దైవ మార్గంలో త్యాగము చేయుట, జనాజ, ఇస్లాంలో జిహాద్. 2001లో వారు పదవి విరమణ చేసిరి. కొంత కాలం నుండి వారు అనేక వ్యాధులతో బాధ పడుచుండిరి. ఖిలాఫత్‌తో వారికి సంపూర్ణ విశ్వాసం, అభిమానం ఉండేది. ఎంతో విధేయతను ప్రదర్శించేవారు. ఎంతో వినమ్రత గలవారు., అభిమానం గల ధార్మిక సేవకులు. వారి కుటుంబములో వారి శ్రీమతితో పాటు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు గలరు. అల్లాహ్ తాలా వారందరికి అహ్మదియ్యత్‌లో స్థిరముగా ఉండు భాగ్యమును కల్గించు గాకా!. వారి తండ్రి చేసిన సత్కార్యములను ముందు కూడ కొనసాగించుదురు గాకా!. విధేయతను చూపుతూ, ఆచరణాత్మక అహ్మదీయులుగా తీర్చి దిద్దును గాకా!. (ఆమీన్).

☆ ☆ ☆ ☆ ☆

EDITOR
SYED RASOOL NIYAZ
SUB EDITOR: MOHAMMAD AKBAR
Mobile. :(+91) 9948692101
e-mail :badartel001@gmail.com
website:www.akhbarbadarqadian.in
:www.alislam.org

REGISTERED WITH THE REGISTER OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
The Weekly BADAR Qadian బదర్ వార పత్రిక ఖాదియాన్
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516
POSTAL REG NO GDP-38/2017-2019, Vol. 2. Thursday 19, JAN 2017 Issue No. 3

MANAGER
NAWAB AHMAD
Tel : (+91)-1872-224757
Mobile. : (+91) 94170-20616
e-mail :managerbadrqnd@gmail.com
ANNUAL SUBSCRIPTION:Rs.300/-

**చిరునవ్వుతో తమ కార్యాన్ని నిర్వహిస్తుండడం ఉత్తమమైన సుగుణం. అతిథులతో ఏ విధముగాను చెడుగా ప్రవర్తించ కూడదు.**

క్రొత్తగా సేవ చేయుటకు వచ్చు వారిలో అప్పటి చిన్న పిల్లలు, నేడు యువకులై సేవకులుగా మారిరి. క్రొత్తగా వారిలో కొందరు పదవీ దారులు, సేవకులుగా ఉన్నారు. ఎక్కడ విధులు నిర్వహించ వలసినప్పటికి కొన్ని ఇబ్బందులను ఎదుర్కో వలసి ఉంటుంది.

**జల్సా సాలాన కెనడా సందర్భమున సేవకులను ఉద్దేశించి హుజూర్ గారు ప్రసంగించిరి. 6/10/2016.**

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ తషహ్హుద్, తస్మియా పఠించిన తరువాత ఇట్లు తెల్పిరి: జమాఅత్ అహ్మదియ్య అల్లాహ్ తాలా కృపానుసారం విశ్వవ్యాప్తముగా జమాఅత్ స్థిర పడిన ప్రతిచోట ధార్మిక సభలు నిర్వహించడం జరుగుతుంది. జల్సా ఏర్పాట్లు కొరకు సేవకులు కూడ ఉంటారు. అల్లాహ్ తాలా దయ వలన జమాఅత్ ఏర్పడిన ప్రతి చోట జల్సా ఏర్పాట్ల కొరకై సేవకులు తమ బాధ్యతలను నిర్వర్తించుట కొరకై ప్రత్యేక శిక్షణ తీసుకోవడం జరుగుతుంది. వివిధ చోట్ల జల్సాలను నిర్వహిస్తున్న సందర్భములో మరియు నేను ప్రత్యేక్షముగా పాల్గొంటున్న యు.కె మరియు ఇతర ప్రాంతాలలో సేవలకులను ఉద్దేశించి సూచనలు ఇవ్వడం జరుగుతుంది. ఆ సూచనలు అల్లాహ్ తాలా కృపానుసారం ఎం.టి.ఏ ద్వారా అన్ని ప్రాంతాలకు చేరుకుంటాయి. ఎం.టి.ఏ తో ముడిపడి ఉన్న ప్రతి ఒక్క సేవకుడు తమ బాధ్యతలను తెలుసుకొంటాడు. అయినప్పటికి బాధ్యతలను గుర్తు చేయడం కూడ అల్లాహ్ తాలా ఆజ్ఞలలో భాగమే.

హుజూర్ అన్వర్ మరల ఇట్లు తెలుపెను: జల్సాలో సేవకులుగా వచ్చు ప్రతి ఒక్కరు స్వంత ఆసక్తితోనే వచ్చారని, బలవంతముగా కాదని, కేవలం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అతిథులకు సేవ చేయుటకు వచ్చామని గుర్తుంచుకోవలెను. మానవుడు తమ ఇంటికి వచ్చే అతిథికి వీలైనంతలో స్థోమతను బట్టి మర్యాదలు చేస్తాడు. మనకు ఎంతో గౌరవ నీయులైన వ్యక్తి అతిథులకు సేవ చేయాలని సూచించారు. ప్రత్యేకించి దైవ చింతనతో ప్రయాణించే అతిథులకు ప్రత్యేక శ్రద్ధతో మర్యాదలు చేయవలసిన అవసరం ఉన్నది.

హుజూర్ అన్వర్ మరల ఇట్లు తెలుపెను: నేను చాలా సంవత్సరాల తరువాత ఇక్కడి కెనడా జల్సాలో పాల్గొంటున్నాను. నా దృష్టిలో ఇక్కడి ఏర్పాట్ల విషయంలో కెనడా జల్సాలో సేవ చేయు సేవకులు తమ కార్యకలాపాలను నిర్వహించ డంలో ప్రతి చిన్న కార్యమును ప్రత్యేకముగా అర్థం చేసుకొనే అనుభవజ్ఞు లైనారని నమ్ముతు న్నాను. ఇన్షా అల్లాహ్. నేను వారి పట్ల నమ్మకం కల్గి యున్నాను, అయినప్పటికి కొన్ని సందర్భాలలో క్రొత్తగా వచ్చు సేవకులు కూడ ఉంటారు. గత కొన్ని సంవత్సరాల నుండి పాకిస్తాన్ నుండే సేవకులు వస్తూ ఉన్నారు. పాకిస్తాన్‌లో ప్రత్యేకించి రబ్వాలో జల్సా జరిగినంత కాలం వారిని అనుభవజ్ఞులుగా పరిగణించే వారు. పాకిస్తాన్‌లో దాదాపు 1984 సంవత్సరము నుండి నేటి వరకు 33, 34 సంవత్సరాల నుండి జల్సా నిర్వహించడం లేదు. ఒకప్పుడు అక్కడ జల్సాలో సేవకుల ఒక తరం వృద్దావ్యంనకు చేరుకున్నది. పెద్ద వయస్సు గల కొందరు వృద్దులు బహుశ ఈ లోకము నుండి వెళ్ళిపోయారు. అప్పుడు ఎవరైతే బాల్య దశలో ఉన్నారో, వారు యువకులై బహుశ అన్సార్ దశకు చేరుకున్నారు. పాకిస్తాన్ నుండి ఇక్కడకు వచ్చు ప్రతి సేవకుడు వారు రబ్వా లేదా ఇతర ప్రాంతాలకు చెందిన వారైనను వారికి అంతగా అనుభవం ఉండి ఉండదు. రబ్వాలో ప్రతి సంవత్సరము లేదా సంవత్సరములో అనేక సార్లు డ్యూటీలు నిర్వహిస్తారు. ఎప్పటికైన అల్లాహ్ తాలా పరిస్థితులను చక్కదిద్దినచో వెంటనే బాధ్యతలను నిర్వహించుటకు లంగర్ (వంటశాల)లో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఏది ఏమైనప్పటికి శిక్షణ కాలం నుండి వెళ్ళడం, ఏదైనా కార్యమును అనుభవంతో నిర్వహించడం, ప్రత్యక్షముగా అతిథులకు సేవ చేయడం వేరు. అందు చేతనే క్రొత్తగా సేవ చేయుటకు వచ్చు వారిలో అప్పటి చిన్న పిల్లలు, నేడు యువకులై సేవకులుగా మారిరి. క్రొత్తగా వారిలో కొందరు పదవీ దారులు, సేవకులుగా ఉన్నారు. ఎక్కడ విధులు నిర్వహించ వలసినప్పటికి కొన్ని ఇబ్బందులను ఎదుర్కో వలసి ఉంటుంది. కొందరు విధులు నిర్వహించే వారికి కోపం తెప్పించుటకు ప్రయత్నింతురు. కొన్ని పరిస్థితులలో సహనం కోల్పోయి చిరాకు పడడం జరుగుతుంది. కాని ఒక అహ్మది ఎల్లప్పుడు ఉన్నత వ్యక్తిత్వంతో ఉండవలెనని గుర్తుంచుకోవాలి. ఇతరుల చెడు ప్రవర్తన అతని వ్యక్తిత్వంపై ఏ మాత్రం దుష్ప్రభావం చూపకూడదు. అత్యంత ఇబ్బందికరమైన పరిస్థితులలో కూడ చిరునవ్వుతో తమ కార్యాన్ని నిర్వహిస్తుండడం ఉత్తమమైన సుగుణం. అతిథులతో ఏ విధముగాను చెడుగా ప్రవర్తించ కూడదు.

హుజూర్ అన్వర్ మరల ఇట్లు తెలుపెను: ఈ విషయములను సహాయకులు, సేవకులు తమ అధికారులకు తెలువవలెను. వారు తమ అమీర్ గారికి ఫలాన వారు ఈ విధముగా చెడుగా ప్రవర్తిస్తున్నారని తెలపాలి. ఫలితముగా వారు క్రమ శిక్షణ శాఖ వారికి వివరించి సంస్కరించే ప్రయత్నం చేస్తారు. అంతేకాని ఎవరు కూడ ప్రత్యక్షంగా జగడ మాడరాదు.

ట్రాఫిక్‌ను నివారించే వారు పార్కింగ్ సమయంలో, మునుపటి కన్న ఎక్కువ కార్లు అయ్యాయి కాబట్టి ట్రాఫిక్‌ను నివారించేందుకు సరైన మార్గ నిర్దేశనం చేయాలి. వాటిని పార్కింగ్ స్థలమునకు తీసుక వెళ్ళడం కష్టమైన కార్యమే. కొందరు అక్కడ పార్కింగ్‌నకు స్థలం లేకున్నను బలవంతముగా పార్కింగ్ చేయుటకు ప్రయత్నిం చుదురు. అలాంటి పరిస్థితులలో వారితో ప్రేమతో వ్యవహరిం చుము. ఎవరైతే నియమ నిబంధనలను ఉల్లఘించు దురో వారిని గురించి ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఫలితముగా క్రమశిక్షణ శాఖ వారు వారికి సమస్యను వివరించి సంస్కరించుటకు ప్రయత్నించుదురు.

(తరువాయి భాగంలో)

☆☆☆☆☆
☆☆☆☆☆

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of the Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz